పస్తులుండలేక.. వలసబాట



కోసిగి నుంచి వలస వెళుతున్న గ్రామస్థులు

పశ్చిమ ప్రాంతంలో వలసలు జోరందుకున్నాయి. స్థానికంగా ఉపాధి లభించకపోవడంతో వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున వలసబాట పడుతున్నారు. కోసిగికి చెందిన సుమారు 300 కుటుంబాలు, చిర్తనకల్ గ్రామం నుంచి 50 కుటుంబాలు 20 బొలెరో వాహనాల్లో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు ఆదివారం బయలుదేరాయి. ఉపాధి పనులు మొదలుపెడతారని ఆశతో ఎదురుచూసినా ఇప్పటి వరకు పనులు చూపలేదని.. చివరికి బతుకుదెరువు కోసం వలస వెళ్లక తప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దకడబూరు మండలం ముచ్చిగేరి గ్రామానికి చెందిన పలువురు గుంటూరుకు వలసబాట పట్టారు. గ్రామంలో ఉపాధి పనులు లేవని వాపోయారు.
–న్యూస్‌టుడే, కోసిగి, పెద్దకడబూరు


ముచ్చిగేరి నుంచి పయనం

నిర్వహణ కష్టం తీరింది

- ఎట్టకేలకు పాఠశాలలకు పైసలు
- రెండేళ్లుగా నిధులు లేక హెచ్‌ఎంల విలవిల



ప్రభుత్వ పాఠశాలలకు గత రెండేళ్లుగా నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సొంత డబ్బు ఖర్చు చేసి పాఠశాలలను నిర్వహించాల్సిన పరిస్థితి. అప్పటి ప్రభుత్వానికి నివేదించినా పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు సమస్యను విన్నవించారు. దీనికి ప్రభుత్వం స్పందించింది. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు రూ. 100 కోట్లు విడుదల చేస్తున్నట్లు మంత్రి ప్రకటించడంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. – న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

రూ.10 కోట్లకుపైగా బకాయిలు


కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 2023-24 విద్యా సంవత్సరానికి సుమారు రూ. 8. 07 కోట్లు, 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ. 2. 15 కోట్ల వరకు గత వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా హెచ్‌ఎంలే తమ జేబు నుంచి ఖర్చు చేశారు. ప్రస్తుతం ఈ బకాయి నిధుల విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉంది.

సుద్దముక్కకూ డబ్బుల్లేక..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,329 ప్రాథమిక, 859 ప్రాథమికోన్నత, 1,009 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఏడాదికి 20 మంది విద్యార్థుల్లోపు ఉన్న పాఠశాలలకు రూ. 10 వేలు, 100 మంది లోపు ఉన్న బడులకు రూ. 20 వేలు, 100 మందిపైగా విద్యార్థులు ఉన్న విద్యాలయాలకు రూ. 50 వేలు నిర్వహణ నిధులు ఇవ్వాలి. గత వైకాపా ప్రభుత్వం కరోనా తర్వాత పాఠశాలలకు సంబంధించిన కాంపోజిట్ గ్రాంట్లు, మండల రిసోర్స్ కేంద్రాల నిర్వహణ నిధులు విడుదల చేయలేదు. 2022-23 విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలకు 25 శాతం నిధులు మాత్రమే ఇచ్చింది. 2023-24 విద్యా సంవత్సరానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఫలితంగా ప్రధానోపాధ్యాయులే సొంత డబ్బులు ఖర్చు చేశారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలతోపాటు రాష్ట్ర, జాతీయ పండగలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు నిధులు లేక ఇబ్బందులు పడ్డారు. సుద్ద ముక్కలకు సైతం నిధులు ఇవ్వకపోవడంతో పాఠశాలల నిర్వహణ భారంగా మారింది. చివరికి చాలామంది హెచ్‌ఎంలు అప్పులు చేసి మరీ పాఠశాలల నిర్వహణ చేపట్టారు.

కాల్వల్లో పూడిక.. పురాల మునక

- పట్టణాలను వెంటాడుతున్న ముంపు భయం
- నిధులున్నా ఖర్చు చేయని వైనం



ఆదోనిలో కురిసిన వర్షానికి కాలువలు పొంగి రహదారిపై నిలిచిన నీరు

చినుకు పడితే చాలు.. పట్టణాలు విలవిల్లాడుతున్నాయి. వీధులన్నీ జలమయమవుతున్నాయి. కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు ముందుకు కదలని పరిస్థితి. దీనికి తోడు వర్షం నీరు చేరుతుండటంతో రహదారులను మురుగు ముంచెత్తుతోంది. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా పూడిక తీత పనులపై దృష్టి సారించడం లేదు.
– న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం, నంద్యాల పురపాలకం, డోన్ పట్టణం, నందికొట్కూరు, బేతంచెర్ల

❍ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. కాలువల్లో పూడికతీత పనులకు నిధులు కేటాయించింది. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ మినహా ఎనిమిది పురపాలిక, నగర పంచాయతీలకు రూ. 422. 095 లక్షలు కేటాయించింది. మూడు నెలలు గడుస్తున్నా నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదు.

సకాలంలో పూర్తిచేయక..

పురపాలికల్లో సొంత నిధులతో పనులు చేయలేక.. అటు ఇచ్చిన నిధులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోలేక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఫలితంగా ఏటా వర్షాకాలంలో పట్టణ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. రహదారులపై మోకాలి లోతు నీరు నిలుస్తోంది. ప్రజలకు ఆస్తి నష్టంతోపాటు రోగాలు చుట్టుముడుతున్నాయి. ఉన్న నిధులతో సకాలంలో పనులు పూర్తి చేస్తే సమస్యలు ఉండేవి కావు. తీరా ముంపు సమస్యలు ఎదురయ్యాక సహాయక చర్యల పేరుతో హడావుడి చేస్తున్నారు.

❍ ఆదోని పట్టణానికి రూ. 1. 16 కోట్లు విడుదలయ్యాయి. వీటిని ఎనిమిది క్లస్టర్లుగా విభజించి పనులు చేయాలని నిర్ణయించారు. మొదటి విడతగా రూ. 45 లక్షల నిధులతో ఒక్కో పని రూ. 15 లక్షలతో చేసేలా చర్యలు చేపట్టారు. పంజరాపోల్, ఆర్. ఆర్. లేబర్ కాలనీ, కొత్త బస్టాండు రహదారి వైపు ఉన్న వంకలు, తిక్కస్వామి దర్గా కూడలి ప్రాంతంలో పూడికతీత పనులు చేపట్టారు. నేటికి 60 శాతం పూర్తైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా రూ. అర కోటికి పైగా నిధులున్నాయి. వీటిని ఎప్పుడు ఖర్చు చేస్తారో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. చినుకు పడితే చాలు.. పట్టణం మీదుగా వెళ్లే 167వ

చినుకు పడితే..


జాతీయ రహదారి చెరువును తలపిస్తోంది. ప్రధాన వాణిజ్య ప్రాంతాలతో పాటు ఆవుదూడ, ఎర్రవంక పరివాహక ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి.

❍ ఎమ్మిగనూరుకు రూ. 71 లక్షలు కేటాయించారు. ఇందులో రూ. 24 లక్షలతో 69 కి. మీ. మేర కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా రూ. 47 లక్షలున్నా సద్వినియోగం చేసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. లక్ష్మణ టాకీస్, శివన్ననగర్, శక్తినగర్, రామయ్య కొట్టాలు, సున్నంబట్టి వీధి, మునెప్ప నగర్, సాయినగర్ ప్రాంతాలను నేటికీ ముంపు సమస్యలు వేధిస్తున్నాయి.

❍ నంద్యాల పురపాలికకు రూ. 1. 49 కోట్లు విడుదలయ్యాయి. మూడు ప్రాంతాల్లో రూ. 15 లక్షల చొప్పున రూ. 45 లక్షలతో పనులు చేపట్టారు. 6 కి. మీ. పొడవునా చామ కాలువ ఉంది. 300 కి. మీ. వరకు మురుగు కాలువలున్నాయి. చేసిన పనులు అరకొరగానే ఉన్నాయన్న విమర్శలున్నాయి. కాలువలు అస్తవ్యస్తంగా ఉండటం.. ప్రధాన వంకలో పూడిక పేరుకుపోవడంతో బైటిపేట, సంజీవనగర్ గేట్, శ్రీనివాసనగర్, సలీంనగర్ తదితర ప్రాంతాలకు ముంపు ముప్పు తప్పడం లేదు.

❍ ఆళ్లగడ్డకు రూ. 30. 66 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో రూ. 16 లక్షలతో పనులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. పట్టణ వ్యాప్తంగా 60 కి. మీ. మేర కాలువలు, 4 కి. మీ. వంక ఉంది. వంకలో పూడికతీత పనులు చేపట్టలేదు. సద్దాం కాలనీ, రామలక్ష్మి కొట్టాల, బుడగజంగాల కాలనీ, శ్మశాన వీధి ప్రాంత వాసులను వరద భయం వెంటాడుతోంది. ఆత్మకూరు పట్టణానికి నిధులిచ్చి వెనక్కు తీసుకోవడంతో పనులు చేపట్టలేకపోయారు.

ఒత్తిళ్లు తీవ్రం రోగాలతో సతమతం



–న్యూస్‌టుడే, కర్నూలు నేరవిభాగం

వారందరూ పోలీసు ఉద్యోగం సాధించేందుకు నెలల తరబడి నిరంతరం సాధన చేశారు. దేహ దారుఢ్యం పెంపొందించుకున్నారు. కేవలం 25 నిమిషాల్లో ఐదు కిలోమీటర్లు పరుగెత్తి ఉద్యోగం సాధించుకున్నారు. కొలువు చేపట్టి విధుల్లో నిమగ్నమయ్యారు. ఆ తర్వాత వ్యాయామం చేయడమే మరిచిపోయారు. చివరికి నడవడమే కష్టంగా మారింది. ఒకవైపు పెరిగిన పనిభారం.. మానసిక ఒత్తిడి.. మరోవైపు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువవుతోంది. ఉమ్మడి జిల్లాలో వెయ్యి మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరవు

ఉమ్మడి జిల్లా పరిధిలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు ఉన్న వారు నిత్యం విధుల్లో ఉండాల్సి రావడం.. వారాంతపు సెలవు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. తీవ్ర ఒత్తిడికి గురై రోగాలబారిన పడుతున్నారు. దీనికితోడు బందోబస్తు విధులు పెరిగిపోయాయి. తిరుపతి, విజయవాడ, విశాఖపట్టణం వంటి సుదూర ప్రాంతాల్లోనూ బందోబస్తు బందోబస్తు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. వెళ్లినచోట కనీస సౌకర్యాలు ఉండటం లేదు. ఫలితంగా బందోబస్తు విధులంటే హడలిపోయే పరిస్థితి నెలకొంది.

వ్యాయామం దూరం

ఒత్తిళ్లు.. అదనపు విధులు తదితర కారణాలతో చాలా మంది మంది వ్యాయామం చేయడం లేదు. కనీసం నడక, యోగా, ధ్యానం వంటి వాటికి సమయం కేటాయించలేకపోతున్నారు. మరికొందరు చేజేతులారా అనారోగ్యాన్ని 'కొని' తెచ్చుకుంటున్నారు. చాలామంది ఊబకాయంతో బాధపడుతున్నారు. 30 శాతానికిపైగా ఉద్యోగులు చక్కెర, రక్తపోటుతోపాటు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. 45 ఏళ్ల వయస్సు పైబడివారు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. గడిచిన ఏడాది కాలంలో కర్నూలు జిల్లాలో 10 మంది చనిపోగా వారిలో 8 మంది అనారోగ్యంతోనే ప్రాణాలు కోల్పోవడం గమనార్హం.

ఆరోగ్య భద్రత ఏదీ..

పోలీసు ఉద్యోగులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఆరోగ్య భద్రత పథకం ఉంది. వీరు మన రాష్ట్రంతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని ఆసుపత్రుల్లోనూ చికిత్స చేయించుకునే వారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కర్నూలు జిల్లాలో 14, నంద్యాల జిల్లాలో 2 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో మాత్రమే చికిత్స పొందేందుకు పరిమితం చేసింది. మరోవైపు నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు సక్రమంగా చెల్లించకపోవటంతో సదరు వైద్యాలయాల నిర్వాహకులు వివిధ కారణాలు చెప్పి చికిత్స చేయకుండా కాలయాపన చేస్తున్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంటు విధానం పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది.

భర్తీ ఎప్పుడో..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 86 పోలీసుస్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. పలు స్టేషన్లలో సిబ్బంది కొరత వేధిస్తుండటంతో పోలీసు అధికారులు, సిబ్బందిపై పనిభారం పెరిగిపోయింది. ఫలితంగా శారీరకంగా.. మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన పోలీసు నియామకాల ప్రక్రియ పూర్తి కాలేదు. మరోవైపు కొత్త జిల్లాలను ఏర్పాటుచేసి సిబ్బందిని విభజించారు. ఫలితంగా మానవ వనరుల కొరత బాగా పెరిగిపోయింది.

హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరులోని కార్యాలయంలో ఆదివారం ఎస్టీయూ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. మధ్యంతర భృతిని ప్రకటించాలని, జీవో నంబరు 117 రద్దు చేయాలని, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు ఇవ్వాలని డిమాండు చేశారు. పాత పింఛను విధానం అమలు చేయాలని, పదోన్నతులు చేపట్టాలని కోరారు. ఎస్టీయూ నాయకులు ఎల్లప్ప, సురేష్, శేఖర్, చంద్రశేఖర్, వెంకట్రాముడు, సంజీవరాయుడు, ఓబులేసు, చిన్న తిమ్మప్ప, నాగమద్దయ్య, ప్రసన్నరాజు పాల్గొన్నారు.

టెట్‌కు 175 మంది గైర్హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 175 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈవో శామ్యూల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీతో టెట్ ముగియనున్నట్లు చెప్పారు.

వ్యాపారులు, దళారులను బయటకు పంపండి


జేసీ డా.నవ్యకు సర్వర్ సమస్య వివరిస్తున్న ఎస్టేట్ అధికారి హరీశ్‌కుమార్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు సీక్యాంపు రైతుబజార్‌లో వ్యాపారులు, దళారులను బయటకు పంపాలని జేసీ డా. బి. నవ్య మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం సీక్యాంపు రైతుబజార్‌ను జేసీ తనిఖీ చేశారు. రైతుబజార్‌లో కూరగాయలు విక్రయించేవారితో మాట్లాడారు. రైతులు, వ్యాపారులు, పొదుపు మహిళలు తదితరుల గురించి ఆమె ఆరా తీశారు. రైతుబజార్‌లో రైతులకు స్థానం కల్పించాలని, ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వంట నూనెల విక్రయాలను ఆమె పరిశీలించారు. ఆయిల్ కౌంటర్‌లో వినియోగదారుల విక్రయాలకు సంబంధించి యాప్ సరిగా పని చేయడం లేదని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. వినియోగదారుల రేషన్ కార్డు నంబరును యాప్‌లో నమోదు చేసిన తర్వాతే వంట నూనెలను విక్రయించడం జరుగుతుందని, సర్వర్ సమస్యతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుబజార్‌లో విద్యుత్తు లైటింగ్, ఫ్లోరింగ్, సీసీ కెమెరాలు, పార్కింగ్ సమస్య, రైతుబజార్ విస్తరణ తదితర సమస్యలను ఎస్టేట్ అధికారి హరీశ్‌కుమార్ జేసీ దృష్టికి తీసుకెళ్లారు. 2018లో రైతుబజార్ విస్తరణకు కేటాయించిన పది క్వార్టర్లను జేసీ పరిశీలించారు. విస్తరణకు సంబంధించి సమగ్రంగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జేసీ మార్కెటింగ్ శాఖ డీఈ రఘురామిరెడ్డికి ఆదేశించారు. పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, మార్కెటింగ్ శాఖ డీఈ రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఏపీఈఆర్‌సీ సమావేశం

కర్నూలు (వెంకటరమణ కాలనీ), న్యూస్‌టుడే: కర్నూలు దిన్నెదేవరపాడు సమీపంలో ఉన్న ఏపీఈఆర్సీ భవనంలో ఏపీ ట్రాన్స్‌కో స్టేట్ కోఆర్డినేషన్ ఫోరం సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఏపీఈఆర్సీ అధికారులు ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి ఏపీ ఈఆర్సీ ఛైర్మన్ సీడీ నాగార్జున రెడ్డి అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో 2024-25 నుంచి 2025-29 వరకు రాష్ట్ర విద్యుత్తు ప్రణాళిక ఆమోదం తదితర అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. ఏపీ జెన్‌కో ఎండీ, ట్రాన్స్‌కో జేఎండీ, డిస్కంల సీఎండీలు, ఎన్టీపీసీ, సెకీ తదితర సంస్థల ఉన్నతాధికారుల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.



గిన్నిస్ వరల్డ్ రికార్డు పత్రం అందుకుంటున్న నిహారిక

అక్కాచెల్లెళ్లు.. అల్లికల్లో విజేతలు

☛ గిన్నిస్ రికార్డులో చోటు సాధించిన కవిత, నిహారిక

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : చాలామంది విద్యార్థులు చరవాణులు, టీవీలు చూస్తూ సమయాన్ని వృథా చేస్తున్నారు. కొందరు విద్యార్థులు మాత్రం ఖాళీ సమయంలో ఇష్టమైన క్రీడలు.. కళలు.. చేతివృత్తులు నేర్చుకుంటూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు చేసుకుంటున్నారు. నంద్యాలకు చెందిన అక్కాచెల్లెళ్లు కవిత, నిహారిక ఇదే విధంగా అల్లికల్లో శిక్షణ తీసుకుని తిరుగులేని ప్రతిభ చూపుతున్నారు. పోటీల్లో సత్తాచాటి ఏకంగా గిన్నిస్ రికార్డులో చోటు సాధించి ప్రశంసలు అందుకుంటున్నారు.

☛ నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన శ్రీనివాసులు, లక్ష్మీదేవి దంపతుల కుమార్తెలు కవిత, నిహారిక. కవిత 10, నిహారిక 8వ తరగతి చదువుతున్నారు. అల్లికలపై ఆసక్తితో నెలవుల్లో శిక్షణ పొందారు. యూట్యూబ్ వీడియోలు చూస్తూ, పత్రికల్లో వచ్చే కథనాలు చదువుతూ ఉలన్ దారంతో గృహ అలంకరణ వస్తువులు తయారు చేయడంపై దృష్టిపెట్టారు. అక్కాచెల్లెళ్లు పోటీపడి అల్లుతూ నైపుణ్యాలు మెరుగుపరుచుకున్నారు. చదువుల్లో సైతం ప్రథమ స్థానాల్లో నిలుస్తున్నారు.

మూడు నెలల్లో 450 వస్తువులు

విశాఖపట్టణానికి చెందిన మహిళా మనోవికాస్ క్రాఫ్ట్ అండ్ క్రియేషన్స్ సంస్థ మూడు నెలల కిందట అల్లికల్లో పోటీలు ప్రకటించింది. అందులో పాల్గొనే వారు ఉలన్‌తో మూడు నెలల్లో 450 రకాల వస్తువులు తయారు చేయాలి. అల్లికలను మొత్తం సెల్ఫీ వీడియోలు తీసి వారానికి ఒకసారి పంపాలి. ఒక వారం ఉపయోగించిన రంగులను మరోవారం వాడకుండా అలంకరణ వస్తువులు తయారు చేయాలి. ఈ నిబంధనలను అనుసరిస్తూ అక్కాచెల్లెళ్లు మూడు నెలల్లో ఒక్కొక్కరు 450 వస్తువులు తయారు చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 22న విశాఖపట్నంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో మహిళా మనోవికాస్ క్రాఫ్ట్ అండ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో అతి పెద్ద ప్రదర్శన నిర్వహించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న ఈ ప్రదర్శనలో కవిత, నిహారికలు తాము రూపొందించిన వస్తువులను ప్రదర్శించారు. గిన్నిస్ రికార్డు సంస్థ నుంచి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.



తాను అల్లిన వస్తువులతో కవిత



కోసిగి సమీకృత బాలుర వసతి గృహం గదుల్లో విరిగిన పంకాలు



గదుల్లో చిందరవందరగా పెట్టెలు, సామగ్రి



వసతి గృహ ముఖద్వారం వద్ద అపరిశుభ్రత

వసతి గృహం.. అసౌకర్యాల నిలయం

మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండల కేంద్రంలోని సమీకృత బాలుర వసతి గృహం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. అక్షరాస్యతలో రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం కోసిగి. ఇక్కడ ఎప్పుడూ కరవు, కాటకాలతో వలసలు అధికంగా ఉంటాయి. ఇక్కడి విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగకుండా ఉండాలని 500 మందికి సరిపడా బాలుర సమీకృత వసతి గృహాన్ని నిర్మించారు. కానీ ప్రస్తుతం 250 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారు. వసతి గృహ భవనం రెండు అంతస్తులు ఉండగా, మొదటి అంతస్తులో మాత్రమే వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. రెండో అంతస్తును నిరుపయోగంగా ఉంచారు. వసతి గృహం చుట్టూ మురుగు నిల్వ ఉంది. ముళ్ల పొదలు, గదుల్లో విరిగిన పంకాలు, ధ్వంసమైన విద్యుత్తు సామగ్రి, గదుల్లో చెల్లాచెదురుగా పెట్టెలు, పగిలిన కిటికీ అద్దాలు దర్శనమిస్తున్నాయి. వసతి గృహ విద్యార్థులు భోజనం చేస్తున్న గదిలోనూ కిటికీల నుంచి దుర్వాసన వస్తోంది. చుట్టూ మలమూత్ర విసర్జన, పందుల సంచారం, చెత్తా చెదారంతో అపరిశుభ్రత చోటుచేసుకుంది.

– న్యూస్‌టుడే, కౌతాళం

నిశ్చితార్థ వేడుకల్లో జిల్లా మంత్రులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి బీసీ.జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. గోవాలో ఓ రిసార్ట్‌లో ఆదివారం నిర్వహించిన ఈ వేడుకల్లో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.



కాబోయే వధూవరులతో టీజీ భరత్, ఫరూక్, బీసీ, టీజీ వెంకటేశ్



జిల్లా జట్టుతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య తదితరులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ఈ నెల 21 నుంచి 23 వరకు హిందూపురంలో నిర్వహించనున్న 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య ఆదివారం ప్రకటించారు. బాలుర జట్టులో దస్తగిరి, జశ్వంత్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, సాదిక్, ప్రణయ్‌కుమార్, ఆసిఫ్, వీర రంగడు, ప్రేమ్‌కుమార్, హర్షిత్, చరన్, అల్లూరయ్యలను ఎంపిక చేశారు. బాలికల జట్టులో భూమిక, లక్ష్మీప్రసన్న, శ్రీవాణి, పూజిత, అక్షరశ్రీ, గౌరి, ఐశ్వర్య, నందిని, సురేఖ, పరిమళ, త్రివేణి, ఉషాశ్రీలను తీసుకున్నారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పతకం తీసుకురావాలన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది శ్రీధరరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు కె.పరమేశ్, సుంకరావు, శేఖర్, వెంకటేష్, కిషోర్, పుల్లన్న అభినందించారు.

సబ్‌జూనియర్ బాలికల యోగాకు...

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ఈ నెల 24 నుంచి 27 వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనాలో నిర్వహించనున్న 49వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల యోగా పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా యోగా సంఘం కార్యదర్శి అవినాష్‌శెట్టి తెలిపారు. బాలికల విభాగంలో మనుశ్రీ, కృష్ణప్రియ, బాలుర విభాగంలో లిఖిత్, సాకేత్, సాత్విక్, రూపా మోహన్‌నాయుడు, మహమ్మద్ ఆశాజ్ పాల్గొంటున్నారన్నారు. వీరు జాతీయ స్థాయి రాణించాలని ఆదివారం జిల్లా యోగా సంఘం ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి రుద్రారెడ్డి, యోగా సంఘం సభ్యులు బ్రహ్మానందరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, అశోక్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, మునిస్వామి, శశిధర్ పాల్గొన్నారు.



నేలవాలిన వరి.. రైతుల కంటతడి

ఇటీవల ఈదురు గాలులతో కురిసిన వర్షానికి తుంగభద్ర నదీతీరంలో సాగైన వరి నేలవాలింది. కౌతాళం మండలం మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు, మరళి, గుడికంబాలి, వల్లూరు తదితర గ్రామాల్లో మొత్తం 4,087 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇందులో సుమారు వెయ్యి ఎకరాల్లో పంట నేలవాలింది. ప్రస్తుతం వరి కంకి దశలో ఉంది. ఈ సమయంలో వరి నేలవాలితే గింజలు మొలకెత్తే అవకాశం ఉంటుంది. దీంతో రైతులు పంటను పైకి లేపి దారంతో కడుతున్నారు. ఎలాగైనా పంటను కాపాడుకోవాలని రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

–న్యూస్‌టుడే, కౌతాళం



నదిచాగిలో వర్షానికి పడిపోయిన వరి

అక్కా.. అమ్మ నిద్రపోయిందా!

☛ ఆగిన కన్న తల్లి గుండె... తల్లడిల్లిన కనుపాపలు

కూలిపనులకు వెళ్లిన తల్లి రోజూ కన్నా.. కొంత ముందుగానే ఇంటికి వచ్చారు. అమ్మ వచ్చిందని ముగ్గురు పిల్లలు ఆమె వద్దకు పరుగున చేరారు. పిల్లలను ఒడిలోకి తీసుకొని ముద్దాడారు. ఇంటి వసారాలో ఉన్న మంచంపై సేద తీరేందుకు నడుం వాల్చారు. అమ్మ అలసిపోయిందని పిల్లల అనుకున్నారు. కొద్దిసేపటి తర్వాత అమ్మా.. అని పిలిచినా ఉలుకూ-పలుకూ లేదు. ఇరుగుపొరుగువారు పిలిచారు.. కదిలించి చూశారు. అప్పటికే ఆ తల్లి లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. అక్కా.. అమ్మ నిద్రపోతోందా..? అని చిన్నారి అడిగిన తీరు చూసి, అక్కడి వారి కళ్లు చెమర్చాయి. ఆడుకుంటూ ఇంటి పట్టునే ఉండండి.. అల్లరి చేయొద్దు అని చెప్పే అమ్మ మాటలు మూగబోయాయి. ఆకలైతే అన్నం కలిపి తినిపించే. . గోరుముద్దలు దూరమయ్యాయి. తీవ్ర విషాదం నింపిన ఈ ఘటన పత్తికొండ మండలంలోని చందోలి గ్రామంలో ఆదివారం జరిగింది. – న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

పత్తికొండ మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన టి.లక్ష్మి(35)ని తుగ్గలి మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన అంజనయ్యకు ఇచ్చి వివాహం చేశారు. దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. రెండేళ్ల కిందట లక్ష్మి భర్త అంజనయ్య గుండెపోటుతో మృతి చెందారు. అత్తగారింట నా అన్నవాళ్ల నుంచి ఆదరణ లేకపోవటంతో. . చిన్నారులతో కలిసి పుట్టింటికి చేరింది. అక్కడే కూలిపనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తూ.. కంటికి రెప్పలా చూసుకుంటూ జీవనం సాగించేది. ఆదివారం కూలిపనుల నుంచి ఇంటికొచ్చిన ఆమె.. సేద తీరుతూ తిరిగిరాని లోకాలకు వెళ్లింది.



తల్లి మృతదేహం వద్ద దిగులుగా కూర్చున్న చిన్నారులు

ఆ పిల్లల పరిస్థితి అగమ్యగోచరం

భర్త చనిపోయిన రెండేళ్లకే లక్ష్మి మృత్యు ఒడికి చేరింది. పుట్టింట్లో సైతం తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ముగ్గురు ఆడపిల్లలు చదువుతున్న జయశ్రీ ఏడో తరగతి, అంకిత నాలుగో తరగతి చదువుతన్నారు. చిన్న కుమార్తె ఉషశ్రీకి ఐదేళ్లు. తల్లిదండ్రులు దూరమవడంతో ఇద్దరి పరిస్థితి దయనీయంగా మారింది. అప్పటి వరకు ఎంతో ఆప్యాయంగా పలకరించిన అమ్మ ఇక ఎప్పటికీ రాదన్న విషయం తెలియని ఆ చిన్నారులు తల్లి మృతదేహం వద్ద దిగులుగా కూర్చున్న దృశ్యం పలువురిని కలచివేసింది.



లక్ష్మి (పాత చిత్రం)

విధి రాసిన విషాద కావ్యం

పాలబుగ్గల పైనుంచి కన్నీటి ధార ఆగడం లేదు. ఆకలి తీర్చే అమ్మ కదలడం లేదు. ఏడుపు వింటే చాలు.. తల్లడిల్లే తల్లికేమైందో ఆ చిన్నారికి తెలియని పరిస్థితి. ఐదేళ్లకే అమ్మ దూరమైంది. ఇందుకు నాన్నే కారణమని అమ్మమ్మ గుండెపగిలేలా ఏడుస్తోంది. విధి విషాద 'కావ్య'ం రాసింది. ఏం జరిగిందో తెలియక బేలచూపులు చూస్తున్న ఆ చిన్నారిని చూసి, అక్కడి వారు కంటతడి పెట్టుకున్నారు.

- న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు

ఆదోని పట్టణం అమరావతినగర్‌లో అత్తారింటి వేధింపులు తాళలేక పావని(22) అనే వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. ఒకటో పట్టణ సీఐ శ్రీరామ్, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణం వాల్మీకినగర్‌కు చెందిన చిన్నగుంటె రంగన్న, నాగమ్మ దంపతుల రెండో కుమార్తె పావనిని ఆదోని పట్టణంలోని అమరావతినగర్‌లో నివాసం ఉంటున్న పురపాలక శాఖ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న శ్రీను అనే యువకుడితో మూడేళ్ల కితం వివాహం చేశారు. వీరికి ఐదు నెలల కుమార్తె కావ్య ఉంది. దసరా పండగ ఉండటంతో ఇటీవల పావని పుట్టింటికి వచ్చారు. శనివారం అత్తారింటికి పంపించారు. ఆదివారం ఉదయం పావని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని తమకు సమాచారం అందిందని తల్లిదండ్రులు తెలిపారు. అక్కడికి వెళ్లి చూసే సరికి తమ కుమార్తె చనిపోయి ఉందని తండ్రి కంటతడి పెట్టాడు. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. తమ కుమార్తెను భర్త, అత్తింటి వారి వేధింపుల వల్లే ఈ అఘాయిత్యానికి పాల్పడిందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదు నెలల చిన్నారి కావ్య తల్లిప్రేమకు దూరమైంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



పావని (పాత చిత్రం)



తల్లి ప్రేమకు దూరమైన చిన్నారి కావ్య

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఆశా కార్యకర్తల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోచమ్మ డిమాండు చేశారు. ఆదివారం నగరంలోని కేకే భవన్‌లో నాయకురాలు శివలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ధరలకనుగుణంగా ఆశా కార్యకర్తల వేతనాలు పెంచాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలన్నారు. వైకాపా ప్రభుత్వం 11 డిమాండ్లను అమలు చేస్తామన్న హామీని ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, నిర్మలమ్మ మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలందరూ ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బి.శివలక్ష్మి, ఈశ్వరిబాయిలను ఎన్నికైనట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పోచమ్మ

దేశ ఔన్నత్యం తెలియజేయాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: భారతదేశ ఔన్నత్యం గురించి చిన్నారులకు తెలియజేయాల్సిన అవసరం ఉందని క్లస్టర్ విశ్వవిద్యాలయ ఉప కులపతి డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. నగరంలోని విజయదుర్గ డిగ్రీ కళాశాలలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతి ప్రాంత స్థాయి క్విజ్, జాతీయ బృందగాన పోటీలను ప్రముఖ వైద్యుడు డా.చల్లా వాసురెడ్డితో కలిసి ప్రారంభించారు. తర్వాత ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ప్రాంత అధ్యక్షులు బీవీ బాలసుబ్రహ్మణ్యం, విజయదుర్గ డిగ్రీ కళాశాల అధినేత సూర్యనారాయణ, లక్ష్మన్న స్వామి, మురళీకృష్ణ, గుండా సతీష్, బుస్సా శ్రీనివాసులు, కోదండ రామయ్య, తోట రామకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్లస్టర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి సాయిగోపాల్

సంక్షేమానికి కృషి చేస్తాం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టైపిస్టు, స్టెనోగ్రాఫర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన బీసీ శంకర్‌నాయక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, బి.బ్రహ్మానందరెడ్డి ఉపాధ్యక్షునిగా, మహ్మద్ అలీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. జిల్లా నుంచి ముగ్గురు ఎన్నిక కావడంతో సంఘం జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టైపిస్టు, స్టెనోగ్రాఫర్ల సంక్షేమం కోసం తమ వంతు కృషి చేస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ శంకర్ నాయక్ పేర్కొన్నారు.

సహకారం.. సంసిద్ధం

☛ త్వరలో సంఘాలకు ఎన్నికలు

ఆళ్లగడ్డ సహకార సంఘం పరిధిలోని పి.చింతకుంటలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి ఆధ్వర్యంలో బహుళ ప్రయోజనకర గోదామును రూ.40 లక్షలతో నిర్మించారు. ఈ కేంద్రం సేవలు అందుబాటులోకి వస్తే పంటలో తేమ శాతాన్ని కొలిచే పరికరం, ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు పట్టలు, పంట నాణ్యతా ప్రమాణాలు కొలిచే పరికరాలు రైతుల సేవలకు సిద్ధంగా ఉంటాయి. ఇవన్నీ లేకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు.



ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: సహకార సంఘాలకు ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహిస్తారని తెలియడంతో రైతులు సంతోషిస్తున్నారు. ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు .ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనతో ఇక ప్రగతిదాయక పాలన సొంతమవుతుందని రైతులు సంతోషిస్తున్నారు. రైతులు ఒక సంఘంగా ఏర్పడి, తమకు కావాల్సిన అవసరాలను తీర్చుకునేందుకు సహకార సంఘాల వ్యవస్థ దోహదపడుతోంది. రైతులకు అండగా ఉన్న ఈ సంఘాలు గత ప్రభుత్వ పాలనలో ఉనికిని కోల్పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైకాపా ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల కమిటీని రద్దు చేసింది. ఇప్పుడు పారదర్శకంగా పాలకవర్గాన్ని ఎన్నుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

రైతులకు అండదండగా...

ఉమ్మడి జిల్లాల్లో 99 సహకార సంఘాలు ఉన్నాయి. 2013లో సహకార సంఘాలకు అధికారికంగా ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా ఎన్నికైన వారు 2018 వరకు బాధ్యతల్లో ఉన్నారు. అప్పుడు అధికారంలోకి ఉన్న తెదేపా ప్రభుత్వం ఈ సంఘాల పదవీ కాలాన్ని ఏడాది పెంచి తర్వాత ఎన్నికలు నిర్వహించాలని భావించింది. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడం సహకార సంఘాలను స్థానిక నాయకుల కనుసన్నల్లో పనిచేసే వారికి అప్పగించడం జరిగింది. గతంలో సహకార సంఘాలే రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండేవి. సంఘంలోని రైతులే తమ ఓటుహక్కుతో అధ్యక్షుడిని, సభ్యులను ఎన్నుకునేవారు. సహకార సంఘాలు రైతులకు పంట సాగుకు పెట్టుబడి సాయం మొదలు రైతులకు కావాల్సిన ఎరువులను, పురుగు మందులను రాయితీపై అందించడంలో కీలక పాత్ర పోషించేవి.. రైతులు తాము పండించిన ఉత్పత్తులకు తగిన ధర వచ్చే వరకు నిల్వ ఉంచుకునేందుకు గోదాములు, తమ బ్యాంకుల ద్వారా రైతులకు వడ్డీ లేకుండా రుణాలు అందించేవి. నేడు ఈ సంఘాలతో అరకొర రుణాలు ఇప్పించడం మినహా ఏ రకమైన ఉపయోగం చేకూరడం లేదు. ఆళ్లగడ్డ పట్టణంలో నడిబొడ్డున విలువైన స్థలం నేడు వృథాగా మారింది. ఆళ్లగడ్డ, బత్తలూరులోనూ గోదాముల నిర్మాణాలకు ఎనిమిదేళ్ల కిందట అనుమతులు వచ్చినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కొత్తగా పి.చింతకుంటలో గోదాము నిర్మాణం పూర్తి చేసుకున్నా ఇంకా అందుబాటులోకి రాలేదు. గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఉపయోగం అందించలేని ఆర్బీకే కేంద్రాలపై ప్రేమ చూపిస్తూ రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచిన సహకార సంఘాలపై సవతితల్లి ప్రేమ చూపించిందన్న ఆరోపణలను మూటగట్టుకుంది. సహకార సంఘాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

గోదాములు వృథా

నంద్యాలలో 1000 మెట్రిక్‌టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు 66, 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న 78 గోదాముల నిర్మాణం పూర్తయినా అవి వృథాగా మారాయి. గోదాముల నిర్మాణానికి రూ.77.40 కోట్లు ఖర్చు చేసినా వృథాగా మారడంతో తెదేపా హయాంలోనైనా ఇవి ఉపయోగంలోకి రాగలవని రైతులు భావిస్తున్నారు.

కర్నూలులో తెలంగాణ మద్యం పట్టివేత

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు ఆదివారం వేర్వేరుచోట్ల దాడులు చేసి అక్రమ మద్యం రవాణా చేస్తున్నవారిని పట్టుకున్నారు. తెలంగాణ వైపు నుంచి వస్తున్న ఓ ఆటోను (ఏపీ 21వై4580) తనిఖీ చేయగా 129 మద్యం సీసాలు దొరికాయి. వాహనంతో సహా మద్యాన్ని సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడిని అరెస్టు చేసి 78 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వారితోపాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి 23 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చిదంబరం, వెంకటేశ్వరమ్మ, మహేశ్వరమ్మ, మద్దయ్య, విజయుడును గుర్తించారు. కర్నూలు ఆబ్కారీ స్టేషన్‌లో అప్పగించగా కేసు విచారిస్తున్నారు.

22న పీఎం-శ్రీపై సమీక్ష

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఈ నెల 22న కలెక్టరేట్‌లో కలెక్టర్ రంజిత్ బాషా ఆధ్వర్యంలో పీఎం-శ్రీపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో శామ్యూల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం-శ్రీకి ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో-2లు, సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ విభాగపు అధికారులు సమీక్షకు హాజరు కావాలన్నారు. మొత్తం 52 పాఠశాలల్లో పీఎం-శ్రీ పథకం కింద అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. సమీక్షకు హాజరుకాని సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవన్నారు.

పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలికకు అదే గ్రామానికి చెందిన ఓ బాలుడితో కొంతకాలంగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ఇద్దరూ మూడు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయారు. బాలిక తల్లిదండ్రుల గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వారిద్దరిని శనివారం కర్నూలులో పట్టుకొని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను తల్లిదండ్రులు మందలించడంతో పురుగు మందు తాగింది. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ పొదుపు భవన్‌లో ఏపీఆర్ఎస్ఏ జిల్లా నూతన అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఇటీవల జిల్లా అధ్యక్ష పదవికి గిరికుమార్‌రెడ్డి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లంపాటి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా నూతన అధ్యక్షునిగా సి.నాగరాజు, జిల్లా కార్యదర్శిగా ఎం.లక్ష్మీరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా (ఆర్గనైజింగ్ సెక్రటరీ)గా కె.రజనీకాంత్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ ముగ్గురితో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ అసోసియేట్ ప్రెసిడెంట్ రామాంజనేయరెడ్డి, జిల్లా కోశాధికారి వేణుగోపాల్ రావు, కర్నూలు, ఆదోని, పత్తికొండ రెవెన్యూ డివిజన్ల, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

కబ్జా వ్యవహారంలో ఎమ్మెల్యే నోరు విప్పాలి

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో సర్వే సంఖ్య 379బీ, 380ఏ లో ఆరు సెంట్ల భూమిని కబ్జాకు పాల్పడిన డాక్టర్ రవికిరణ్ వ్యవహారంలో ఎమ్మెల్యే పార్థసారథి నోరువిప్పాలని వైకాపా పట్టణ కన్వీనర్ చంద్రకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కబ్జాలను అణచివేస్తానని ఎమ్మెల్యే ప్రజలను మభ్యపెట్టారన్నారు. ఏకంగా ఆధార్ కార్డునే మార్చి దేశ చట్టాలను అవహేళన చేశారన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పురపాలక వైస్ ఛైర్మన్ నరసింహులు, కామాక్షి తిమ్మప్ప, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాలు చేయలేదు

కప్పట్రాళ్ల (దేవనకొండ), న్యూస్‌టుడే: మండలంలోని కప్పట్రాళ్ల రక్షిత అడవుల్లో ఎలాంటి యురేనియం తవ్వకాలు జరగడం లేదని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి రామచంద్రుడు పేర్కొన్నారు. కప్పట్రాళ్ల గ్రామంలో ఆదివారం పర్యటించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. రక్షిత అడవుల్లో ఎలాంటి తవ్వకాలు చేయలేదన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అటవీశాఖ అధికారులు రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

చిప్పగిరి, న్యూస్‌టుడే: సమస్య : దేగులపాడు బీసీ కాలనీలోని మురుగు కాల్వ నిండింది. శుభ్రం చేయించాలి. **- నారాయణ, దేగులపాడు**

సమాధానం: వర్షాలు రావడంతో రహదారిపై మట్టి కొట్టుకొపోయి మురుగు కాల్వలో చేరింది. పంచాయతీ సిబ్బందిని పంపించి మురుగు కాల్వలు, వీధులు శుభ్రం చేయిస్తాం. **- నీలకంఠ, సర్పంచి దేగులపాడు**

మద్దికెర, న్యూస్‌టుడే: సమస్య: మద్దికెరలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోనే కొందరు చెత్త వేస్తున్నారు. మరికొందరు కోళ్ల వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో ఆవరణ వ్యర్థాలతో నిండిపోతోంది. చర్యలు చేపట్టాలి.
- రాము, మద్దికెర

సమాధానం: పాఠశాలను పరిశీలించి అవసరమైన పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. వ్యర్థాలను తొలగించడంతో పాటు, మరో సారి ఈ ప్రాంతంలో వేయకుండా చర్యలు తీసుకుంటాం.
- మద్దిలేటిస్వామి, ఈవోపీఆర్డీ, మద్దికెర

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: సమస్య: ఆదోని పట్టణంలో హన్మాజీపేట జైన్ మందిరం ప్రాంతంలో సీసీ రహదారి దెబ్బతిని రాళ్లు తేలాయి. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సీసీ పనులతో రహదారిని చదును చేయాలి. **- ఉరుకుందు, ఆదోని**

సమాధానం: ఆ ప్రాంతంలో పర్యటించి సమస్య పరిశీలించి, పరిష్కరిస్తాం.
- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

హొళగుంద, న్యూస్‌టుడే: సమస్య: ఎల్లార్తి ప్రధాన రహదారిలోని మినీ ట్యాంకు పక్కన నీరు చేరడంతో పరిసరాలంతా అపరిశుభ్రంగా మారాయి. దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. **- రజాక్, ఎల్లార్తి**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. **- షఫీ, పంచాయతీ కార్యదర్శి**

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలోని వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లే దారిలో విద్యుత్తు స్తంభాలు, వీధి దీపాలులేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్తు స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.
- సుంకన్న, కాలనీ వాసి. పత్తికొండ పట్టణం

సమాధానం: కాలనీలో పర్యటించి ఎక్కడెక్కడ విద్యుత్తు స్తంభాలు అవసరమవుతాయో పరిశీలించి స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.
- నారాయణస్వామి, విద్యుత్తుశాఖ ఏఈ, పత్తికొండ.

ఏరూరు (చిప్పగిరి), న్యూస్‌టుడే: సమస్య : కాల్వలు లేక రహదారులపైకి మురుగు ప్రవహిస్తోంది. భూగర్భ డ్రైనేజీలను ఏర్పాటు చేయాలి.
- గోపాల్, ఏరూరు

సమాధానం: రహదారులపైకి మురుగు వదలే వారిని గుర్తించి నోటీసులు ఇస్తున్నాం. మురుగుకాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే కాల్వలు ఏర్పాటు చేస్తాం.
- నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి ఏరూరు

తెగిన దారులు.. సాగని రాకపోకలు

☛ గ్రామాలకు స్తంభించిన ప్రయాణాలు
☛ వర్షాలతో చెదిరిన కల్వర్టులు

ఇటీవల కురిసిన వర్షాలకు దారులు చెదిరిపోయి.. రాకపోకలకు ఆటంకంగా మారాయి. ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని పలదారుల్లో ప్రయాణించలేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

గుమ్మనూరు దాటేదెలా!



చిప్పగిరి, న్యూస్‌టుడే: గుమ్మనూరు- దేగులపాడు మధ్య ఉన్న పెద్ద వాగు వంకపై నిర్మించిన వంతెన చెదిరిపోయింది. దీంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రెండేళ్ల కిందట రూ.5 లక్షల వ్యయంతో వాగుపై పైపులు వేసిన వంతెన నిర్మించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉద్ధృతంగా ప్రవహించిన వంతెనకు ఓ పైపు కాంక్రీట్ కొట్టుకుపోయింది. ఈ కారణంగా దేగులపాడు గ్రామస్థులు బళ్లారి రైలుకు వెళ్లేవారు, గుమ్మనూరుకు వెళ్లాలన్నా.. నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. అటువైపు ఉన్న పొలాల్లో ధాన్యం తెచ్చుకొనేందుకు వీల్లేకుండా వంతెన కొట్టుకుపోయింది. ఈ రెండు గ్రామాలకు చెందిన మూడు వేల ఎకరాల సాగుకు రైతులు ఈ వంతెనపై నుంచే వెళ్లాలి. ప్రత్యామ్నాయ మార్గం లేదు. అధికారులు వంతెనను పరిశీలించి తక్షణం మరమ్మతు చేయాలని గుమ్మనూరు, దేగులపాడు గ్రామస్థులు కోరుతున్నారు.

మోకాళ్లలోతు నీటిలో..!



తుగ్గలి, న్యూస్‌టుడే: తుగ్గలి- పత్తికొండ ప్రధాన రహదారిలో తుగ్గలి రైల్వే వంతెన కింద ప్రయాణించాలంటే.. ప్రయాస తప్పడం లేదు. వర్షం వచ్చిందంటే చాలు వంతెన కింద మోకాళ్ల లోతు నీటిలో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్ల లోతు నీటిలో గుంతలు కనిపించక ఎంతో మంది ద్విచక్రవాహనదారులు అక్కడ కిందపడి గాయాలపాలవుతున్నారు. రైతులు పొలాలకు వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. దెబ్బతిన్న రహదారిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద మండలం అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో భారీ గుంత పడింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. 54వ డీపీ చిన్నకాలువ నుంచి ఆయకట్టుకు వెళ్లే రైతులు పొలాలకు వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. నిత్యం ట్రాక్టర్లలో ఎరువులు, కూలీలు ఇదే దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాలతో మట్టికోతకు గురై భారీగా గుంత ఏర్పడింది. వాహనాలు ప్రమాదాలకు గురవుతాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు, భక్తులు కోరుతున్నారు.

అడుగడుగునా గండాలు



భయపెడుతున్న వాగులు



ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కురుస్తున్న వర్షాలకు దారులు భయపెడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి మొలగవల్లి - ఆలూరు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. ఈ రెండు గ్రామాల మధ్య మూడు వాగులు ఉన్నాయి. భారీ వర్షం కురిసిన ప్రతిసారి పొంగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల వాగు ప్రవహిస్తుండగా ఓ వ్యక్తి ప్రమాదం చిక్కుకుని, బయటపడ్డారు. వాగులపై ఎత్తైన వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.

గుంతలో ఇరుక్కుపోయిన లారీ



బిణిగేర(ఆస్పరి), న్యూస్‌టుడే: ఆస్పరి నుంచి ఆదోనికి వెళ్లే రహదారి గుంతలుమయంగా మారింది. వాహనాదారులకు ప్రమాదకరంగా మారింది. ఆస్పరి నుంచి ఆదోనికి 22 కి.మీ. ప్రయాణించాలి. బిణిగేర గ్రామంలో మూడు చోట్ల దారిపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. వర్షం వస్తే ఈ గుంతల్లో నీరు చేరి, చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. ఆదివారం పెద్ద టెంపో గుంతలో ఇరుక్కు పోయింది. రహదారికి ఇరువైపులా వాహనాలు పెద్దఎత్తున బారులు తీరాయి. సుమారు రెండు గంటల పాటు శ్రమించినా.. బయటకు రాలేదు. పొక్లెయిన్‌తో లారీ వెనుక భాగంలో మట్టి తొలగించడంతో ముందుకు కదిలింది. బస్సు, కార్లు, ఆటోల్లోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బర్రెలగొట్టు కొండలో చిరుత సంచారం

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలోని తొగలగల్లు- దొడగొండ గ్రామాల మధ్యలోని బర్రెల గొట్టు కొండలో చిరుత సంచారంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. కొండపై చిరుత ఉండగా స్థానికులు చాలా మంది చూసినట్లు గ్రామ సర్పంచి అంజనయ్య తెలిపారు. కొండ సమీపంలో జింకను సైతం చంపి తినేసిందన్నారు. కొండ చుట్టూ దొడగొండ, తొగలగల్లు రైతులు పొలాల్లో పత్తి, మిరప, సజ్జ పంటల్లో కలుపు, కోతకు వెళ్లేందుకు భయపడుతున్నారు. సంబంధిత అటవీ అధికారులు చిరుతను పట్టుకోవాలని స్థానిక ప్రజలు రైతులు కోరుతున్నారు.

ఆదోనిలో మద్యం దుకాణం మార్పు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ప్రభాకర్ థియేటర్ సమీపంలోని పురాతన శంభులింగేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన మహారాజా వైన్స్ మద్యం దుకాణం తొలగించాలని విరాట్ హిందూస్థాన్ సంఘం, స్థానికులు, శివభక్తులు ఈ నెల 19వ తేదీన ఆదోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడించి, నిరసన తెలిపిన విషయం విదితమే. స్పందించిన ఆదోని ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న మహారాజా వైన్స్ దుకాణాన్ని ఆ ప్రాంతం నుంచి మున్సిపల్ మెయిన్ రోడ్డులోకి మార్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదోని మండలం సలకలకొండ గ్రామంలో ఆదివారం పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సీసీ రహదారి పనులకు పూజ చేశారు. గ్రామంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గుడిసె కృష్ణమ్మ, దేవేంద్రప్ప, జనసేన పార్టీ బాధ్యుడు మల్లప్ప, భాజపా నాయకులు నాగరాజుగౌడు, ఉపేంద్ర, మాజీ ఎంపీపీ పంపాపతి, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సలకలకొండ గ్రామంలో సీసీ రహదారికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూరు పట్టణంలో సీసీ రహదారుల నిర్మాణానికి రూ.48 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆలూరు నియోజకవర్గ నాయకుడు వీరభద్రగౌడు అన్నారు. ఆలూరులోని మరిస్వామి కాలనీలో సీసీ రహదారుల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో రమదేవి, పంచాయతీ రాజ్ ఏఈ చౌడరెడ్డి, తెదేపా నాయకులు నరసప్ప, ముద్దరంగ, రామాంజి, జిలాని, బెళగంటి కురవ హనుమప్ప, వన్నూర్ సాబ్, తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద, న్యూస్‌టుడే: హొన్నూరు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో సీసీ రహదారి నిర్మాణానికి తెదేపా ఆలూరు నియోజకవర్గ నాయకుడు వీరభద్రగౌడు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌డీఈ మనోహర్, పీఆర్ జెఈ మునెప్ప, ఏపీవో భక్తవత్సలం, పంచాయతీ కార్యదర్శి కార్యదర్శి రాజశేఖర్‌గౌడ, తెదేపా కూటమి నాయకులు రాజపంపన గౌడ, మిక్కిలినేని ప్రసాద్, రమేష్ రెడ్డి, వేణుబాబు, బాబీ, శ్రీనివాసులు, పంపాపతి, దుర్గయ్య, వెంకటేష్, ఎర్రిస్వామి, మల్లి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నహోతూరు, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి గ్రామల్లో పల్లె పండుగ నిర్వహించారు. తెదేపా వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదిర్శి ముత్యాలరెడ్డి, మాజీ సర్పంచి వరదరాజులు తెదేపా నాయకులు నాగేంద్ర, నేట్టేకల్లు, నాగేంద్రరెడ్డి, వీరేష్, రాజ్‌కుమార్ సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు సర్పంచి హరికృష్ణ, రామంజనేయులు, పురుషోత్తమరెడ్డి, రాఘప్ప, నాగేంద్ర, వీరేష్ హనుమంతరెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీవో రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆలూరులో భూమి పూజ చేస్తున్న వీరభద్రగౌడు, తదితరులు

కోతిరాళ్ల(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: కోతిరాళ్లలో సీసీ రహదారుల ఏర్పాటు ఉపాధి పథకం ఏపీడీ పక్కీరప్ప, మాజీ సర్పంచి శిరీష ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నాగేశ్, మధ్యాహ్నమయ్య, ఉపాధిహామీ పథకం సిబ్బంది రత్నం, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధే తెదేపా ధ్యేయమని మండల నాయకుడు సుబ్బరాయుడు అన్నారు. బొమ్మిరెడ్డిపల్లి, రత్నపల్లి, బొయినపల్లి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నర్సింగ్ కాంతారెడ్డి, నాగేశ్వరరెడ్డి, మహిధర్‌రెడ్డి, ఆనంద్‌యాదవ్, రామచంద్రుడు, ఎంపీడీవో సుహాసినమ్మ, ఏపీవో లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయానికి విరాళం

దేవనకొండ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అనంతపురం జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రూ.1,00,216 చెక్కును ఆలయ నిర్వాహకులకు అందజేశారు. 15ఏళ్ల కిందట దేవనకొండ తహసీల్దారుగా ఆయన పనిచేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, ఆలయ నిర్వాహకులు వేణుకుమార్, రంగస్వామి, బలరాముడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నరసారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన దేవరగట్టు కొండ గుహలో వెలసిన మాళ మల్లేశ్వర స్వామి మూల విరాట్టులకు ఆదివారం వేకువజామునే జలాభిషేకం, బండారు అర్చన, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ఆకు పూజలు, అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళ హారతి ఆలయ అర్చకులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.



మాళమల్లేశ్వర స్వామి మూలవిరాట్టు

చిన్నారుల చుట్టూ చిక్కుముళ్లు

ఇది చిన్నపిల్లలు ఆట, పాటలతో చదువుకునే అంగన్‌వాడీ కేంద్రం. భవనం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ముళ్లకంపలు పెరిగిపోయాయి. ఇలా ఉంటే కేంద్రంలోకి విషసర్పాలు ప్రవేశించే ప్రమాదం ఉంది. మూత్రవిసర్జనకు, ఆడుతూ ముళ్లచెట్ల వైపు వెళ్లినా.. ఇబ్బందులేనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముళ్లకంపలను తొలగించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కురుకుంద (ఆలూరు గ్రామీణ)



పెరిగిన దిగుబడి... ధరలు తడబడి

పత్తికొండ టమాటా మార్కెట్‌లో వరుసగా నాలుగు రోజులుగా టమాటా ధరలు తగ్గాయి. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా పంట నాణ్యత కాస్త తగ్గటం, అధిక స్థాయిలో దిగుబడి మార్కెట్‌కు రావటం ధరల తగ్గుదలకు కారణమని అధికారులు వెల్లడించారు. నాలుగు రోజులుగా క్వింటా గరిష్ఠ ధర రూ.3వేలు కాగా కనిష్ఠ ధర రూ.1500 పలుకుతోంది. ఇంతకాలం క్వింటా ధర రూ.5వేలకు పైగానే పలకగా.. దసరా తర్వాత ధరలు తగ్గుముఖం పట్టాయి.

- న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం



రహదారికి మరమ్మతు చేపట్టండి

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర నుంచి పత్తికొండకు వెళ్లే ప్రధాన రహదారి పలుచోట్ల దెబ్బతినటంతో ప్రయాణం నరకంగా మారిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం నాయకులతో కలిసి ఆదివారం పత్తికొండ రోడ్డును పరిశీలించారు. ఈ రహదారిలో ప్రయాణించాలంటే.. రెట్టింపు సమయం పడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, వెంకటేశ్వరరెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పల్లె పండుగ

తుగ్గలి, న్యూస్‌టుడే: మండలంలో పల్లె పండుగ కార్యక్రమం ఆదివారం ఉప్పర్లపల్లి, యల్లమ్మగుట్టతండా, రోళ్లపాడుతండాలో పూర్తయినట్లు ఉపాధి ఏపీఓ హేమసుందర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు కలిసి సీసీ రహదారులు, మురుగు కాలువలు పనులకు భూమి పూజ కార్యక్రమం అన్ని గ్రామాలలో పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రాయితీ రుణాలు అందించాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా చేతి వృత్తిదారులకు రాయితీ రుణాలు అందించాలని చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి యం. కారన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేతి వృత్తిదారులు స్వయం శక్తితో, ఆత్మగౌరవంతో జీవించడానికి అవసరమైన ఆర్థిక సహకారం అందించాలన్నారు. ఈ నెల 22న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొండయ్య తెలిపారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హాజరవుతారన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలు వివరించవచ్చన్నారు.

సౌకర్యాలకు గోడ కట్టారు

☛ రైల్వే వంతెన మూసివేయడంతో అవస్థలు
☛ మూగజీవాలకు తప్పని ప్రయాస

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని పూర్వ వైఎంకే. ఉన్నత పాఠశాల సమీపంలోని నల్లరైల్వేగేటు మూసివేశారు. దీంతో కర్షకులు, కార్మికులతో పాటు మూగజీవాలకు ప్రయాస తప్పడం లేదు. పురాతన రైల్వే వాకిలి ఇది. గేటు మీదుగా ట్రాఫిక్ సమస్యల నియంత్రణ కోసం ఇక్కడ సమీపంలో ఆకాశవంతెన నిర్మించారు. కొంత కాలం రైల్వే గేటుపై రాకపోకలకు అనుమతిచ్చి, కొవిడ్ సమయంలో శాశ్వతంగా రైల్వే గేటు మూసివేసి, రహదారికి అడ్డుగా గోడ నిర్మించారు. దీంతో గేటు మీదుగా రాకపోకలు సాగించే కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..

నల్లరైల్వే గేటు పై ప్రాంతంలో మార్కెట్ యార్డుతో పాటు పదుల సంఖ్యలో పత్తి పరిశ్రమలు, వేరుశనగ డిగార్డిగేటర్లు, జిన్నింగ్, నూనె, కలప పరిశ్రమలున్నాయి. అమరావతి నగర్, దేవినగర్, బసాపురం, పర్వతాపురం గ్రామాలున్నాయి. మార్కెట్ యార్డుతో పాటు పరిశ్రమలు నమ్ముకుని వేల మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు. యార్డులో పత్తి, వేరుశనగ దిగుబడుల తరలింపునకు వందల ఎడ్లబండ్లు ఉన్నాయి. గుమాస్తాలూ సుమారు వెయ్యి మంది ఉన్నారు. ఇలా మొత్తం 5-6 వేల మంది మార్కెట్ యార్డుతో పాటు పరిశ్రమలను నమ్ముకుని కాలం గడుపుతున్నారు. వీరంతా రైల్వే వాకిలికి ఇటువైపు ఉన్న పాత పట్టణం నుంచి రోజు వారీ పనులకు వెళ్లిరావాలి. పాత పట్టణంలోని వాల్మీకినగర్, హనుమాన్‌నగర్, రాజరాజేశ్వరినగర్, తదితర ప్రాంతాల నుంచి మార్కెట్ యార్డుకు రావాలంటే నాలుగైదు కి.మీ. దూరం. రైల్వే వాకిలి మూసేయడంతో చుట్టూ వంతెన పై నుంచి తిరిగి రావాల్సి వస్తోంది. ఇలా వంతెన చుట్టూ మార్గం 2-3 కి.మీ. ఉంటుంది. ఈ లెక్కన రోజు పది కి.మీ. నడవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడ్లు సైతం యార్డులో చేసిన పనికన్నా.. రాత్రిళ్లు వంతెన ఎక్కి, దిగేందుకు ఇబ్బంది పడుతున్నాయన్నారు. రాత్రిపూట ఇళ్లకు చేరుకోవాలంటే మహిళా కూలీలకు సైతం అవస్థలు పడుతున్నారన్నారు.



మూసివేసిన నల్లరైల్వేగేటు

ప్రత్యామ్నాయ మార్గం ఉన్నా..

రైల్వేగేటు మూయకకుండా ప్రత్యామ్నాయ మార్గం చూపే అవకాశమున్నా.. పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం రోజు రోజుకు విస్తరిస్తోంది. అందుకనుగుణంగా సేవలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేస్తున్నారు. భారీ వాహనాలకు వంతెన మీదుగా అనుమతించి, నల్ల రైల్వే గేటు ప్రాంతంలో భూగర్భ వంతెనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఈ మార్గంలో పాదాచారులు, ఎద్దులు బండ్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు అనుమతించేలా నిర్మిస్తే మేలు జరుగుతుందని కోరుతున్నారు. రైల్వేశాఖ అధికారులు ఇక్కడి కార్మికుల, జనవాసాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని భూ గర్భ వంతెన సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

గేటు మూసివేతతో ఇబ్బందులు


- నరసన్న, వాల్మీకినగర్



40 ఏళ్లుగా మార్కెట్ యార్డులో హమాలీగా పనిచేస్తున్నా. రోజు మా ఇంటి నుంచి యార్డుకు వెళ్లాలంటే పది కి.మీ. నడవాల్సి వస్తోంది. గతంలో రైల్వే గేటు ఉండటంతో నాలుగైదు కి.మీ. దూరం ఉండేది. రాకపోకలకు సమయం కనిపించేది కాదు. ఇప్పుడు వంతెన మీదుగా రాకపోకలతో దూరంతో పాటు దుమ్ము, దూళితో ఆయాసం పడుతున్నాం. ఇవన్నీ ఎవరికి చెప్పుకోవాలి.

భూగర్భ వంతెన నిర్మించాలి

- కర్ణ, ఫారెస్ట్‌లైన్ ప్రాంతం



రైల్వే వాకిలి మూసేయడంతో వంతెన మీదుగా రాకపోకలు సాగించాలంటే ప్రయాస తప్పడం లేదు. ఏదైనా అత్యవసరం మీద ఇంటికి వెళ్లాలంటే ఆటోకు రూ.100 వెచ్చించాల్సి వస్తోంది. పనులు ఆలస్యమైతే చీకట్లో ఇంటికి చేరాలంటే ఇబ్బంది పడుతున్నాం. గేటు ఉంటే వేల మంది పాదచారులు, ఎడ్ల బండ్లకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇక్కడ భూగర్భ వంతెన నిర్మించి మా కష్టాలు తీర్చాలి.

నిందితులను శిక్షించాలి

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కడప జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థినిపై దాడిచేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని దూదేకుల సంఘం తాలూకా అధ్యక్షుడు సాలిసాహెబ్, ప్రదాన కార్యదర్శి, న్యాయవాది షేక్షావలి డిమాండ్ చేశారు. ఆలూరులో ఆదివారం విలేకరులు సమావేశంలో వారు మాట్లాడారు. ప్రేమ పేరుతో లొంగదీసుకుని పెట్రోలు పోసి నిప్పంటించిన నిందితుడు విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హమాన్, అల్లీపీరా, శుకురు, తదితరులు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలు స్మరించుకోవాలి

చిప్పగిరి, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల త్యాగాలు స్మరించుకోవాలని చిప్పగిరి ఎస్సై సతీష్‌కుమార్ అన్నారు. అమర వీరుల దినోత్సవం సందర్భంగా చిప్పగిరి పోలీసు స్టేషన్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల కోసం ఎంతో మంది పోలీసులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. అమర వీరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో పోలీసులు సుబ్రహ్మణ్యం, బషీర్, యశ్వంత్, భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రజలకు, విద్య, వైద్యం, ఇతర సేవలు అందిచడమే లక్ష్యమని రోటరీ



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ చిన్నప్పరెడ్డి

క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ చిన్నప్పరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మిగనూరులోని కల్యాణ మండపంలో ఉచిత వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 220 దేశాలలో అనేక సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ముందు ఉంటుందన్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా బాలికలకు ఉచిత సైకిళ్ల పంపిణీ, నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందిచనున్నట్లు పేర్కొన్నారు. గర్భిణులు, మానసిక వికలాంగులు, క్రీడాకారులకు సేవలు అందిస్తుందన్నారు.

వేరుశనగ క్వింటా రూ.5,920

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్లో ఆదివారం వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ.5,920, మధ్యస్థం రూ.5,089, కనిష్ఠం రూ.1,820కు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు రైతులు 2,122 వేరుశనగ బస్తాలు అమ్మకానికి తెచ్చారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,853, మధ్యస్థం రూ.5,843, కనిష్ఠం రూ.5,079 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) మంత్రాలయం : 98859 97892 గోనెగండ్ల : 80085 73827

సి.బెళగల్, న్యూస్‌టుడే: **సమస్య:** కొండాపురంలో నిరుపయోగంగా ఉన్న సచివాలయ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. **-వెంకటేశ్వర్లు, కొండాపురం**

సమాధానం: ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటాం. **-రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్**

సమస్య: చింతమానుపల్లె సచివాలయంలో మూత్రశాల లేక మహిళా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. **-రంగన్న, చింతమానుపల్లె**

సమాధానం: సత్వరమే పంచాయతీరాజ్‌శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడుతాం. **-రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్**

సమస్య: చింతమానుపల్లె నుంచి తిమ్మందొడ్డి రహదారిపై గుంతలు పడి వాహనాదారులకు ఇబ్బందిగా ఉంది. **-ప్రతాప్‌రెడ్డి చింతమానుపల్లె**

సమాధానం: మండల ఏఈ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **-రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్**

సమస్య: సి.బెళగల్ వడ్డెర కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి. **-వడ్డె వీరేశ్, సి.బెళగల్**

సమాధానం: వడ్డెర వీధుల్లో మౌలిక సదుపాయాలు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. **- రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని మేకడోన గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో కాల్వలు నిండి దుర్వాసన వెదజల్లుతోంది. **-గ్రామస్థులు, మేకడోన**

సమాధానం: మేకడోన గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. **-జయరాముడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు**

పశువుల దొడ్డి కాదు.. ప్రజా పరిషత్ కార్యాలయం

గూడూరులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం పశువులకు అడ్డాగా మారింది. రోజు పదుల సంఖ్యలో పశువులు కార్యాలయం ముందు గుంపులుగా ఉంటున్నాయి. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో అవసరాలకు వచ్చే ప్రజలుకు అటంకం కలుగుతోంది. వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని చోదకులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, గూడూరు



తొలగించాలి కంప చెట్లు.. వాహనాలు కనిపించేటట్లు

మండల పరిధిలోని జూలకల్లు నుంచి బ్రాహ్మణదొడ్డి గ్రామానికి వెళ్లే బీటీ రహదారి వెంట కంప చెట్లు దట్టంగా పెరిగాయి. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు తరుచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. మూడు కి.మీ. దూరంలో 7 మలుపులు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించి ప్రమాదాలను నివారించాలని ఇరు గ్రామాల ప్రజలతో పాటు వాహనచోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గూడూరు



విక్రయాలకు వేదికలు లేక..

వేదన తీరక

ఆరు వేల ఎకరాల్లో సాగు



ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రైతులు పండించిన కూరగాయలను స్వయంగా అమ్ముకునేందుకు సరైన వేదికలు లేవు. కూరగాయల ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం రాయితీతో సరకులు అందించేందుకు స్థలం లేదు. ప్రధానంగా ఎమ్మిగనూరు, గూడూరులో రైతు బజార్లు ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా డిమాండ్ ఉన్నా.. ఆ దిశగా చర్యలు చేపట్ట లేదు. వైకాపా ప్రభుత్వం రైతు బజార్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదు. కూటమి ప్రభుత్వం అయినా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని పట్టణ వాసులు, రైతులు కోరుతున్నారు.

మంత్రాలయం, ఎమ్మిగనూరు, గూడూరు పరిధిలో దాదాపు 35 వేల వ్యవసాయ విద్యుత్తు బోర్లు, బావుల కింద 6 వేల ఎకరాల్లో కూరగాయలు సాగుచేస్తున్నారు. టమాట, ఉల్లి, మిరప, ఇతర కూరగాయలు, ఆకుకూరలు అధికంగా పండిస్తారు. రైతులు పండించిన ఉత్పత్తులను నేరుగా విక్రయించేందుకు మార్గం లేక పోవడంతో విరంతా దళారుల తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, ఆలూరు, నియోజకవర్గాల్లో రైతులు దిగుబడులను ఇతర మార్కెట్లకు తరలిస్తున్నారు. రవాణా ఛార్జీలు పోనూ ఏమీ మిగలడం లేదని రైతులు వాపోతున్నారు. స్థానికంగా రైతు బజారు ఉంటే వాటిని ఇక్కడే నేరుగా అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది.

రైతులు, వినియోగదారుల నుంచి..

ఎమ్మిగనూరులో అత్యధికంగా సరకు క్రయవిక్రయాలు చేస్తారు. రైతుల తెచ్చిన కూరగాయాలను స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో 43 మంది కమీషన్ ఏజెంట్లు వ్యాపారులకు అమ్ముతారు. మార్కెట్‌కు ప్రతి రోజూ 900 మందికిపైగానే రైతులు నిత్యం సరకును తీసుకువస్తారు. రోజూ దాదాపు టమాట 6 వేల కిలోలు, పచ్చి మిరప 3 వేలు, వంకాయాలు 2 వేలు, క్యాబేజీ 3 వేల కిలోలు, క్యారెట్ 2 క్వింటాళ్లు, ఉల్లి 1,500 కిలోలు, బీర 1,500, బెండ 3 వేల కిలోలు, ఇతర దిగుబడులు మరో 4 వేల కిలోలు అమ్మకానికి తెస్తారు. వీటి విలువ దాదాపు రూ.24 లక్షలు నుంచి రూ.30 లక్షలు మేరకు ఉంటుంది. కానీ రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దళారీ రూపంలో కమీషన్ దండుకుంటున్నారు. రైతులు తెచ్చిన కూరగాయలను తక్కువ ధరకు తీసుకొని వినియోగదారులకు రెండింతలు ఎక్కువగా అమ్మి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.

పట్టణంలో ప్రజాప్రతినిధులు, వ్యాపారులు కుమ్మక్కై రైతు బజార్ ఏర్పాటు చేయలేదు. గతంలో హెచ్‌బీఎస్ కాలనీలో సహకార సంస్థకు చెందిన స్థలంలో రైతు బజార్ ఏర్పాటు చేశారు. అప్పట్లో రైతుల వద్ద తక్కువ ధరలకే కూరగాయలు అమ్మడంతో వ్యాపారుల ఆదాయానికి గండి పడింది. వైకాపాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి పట్టించుకోక పోవడంతో వాటిని పూర్తిగా తొలగించారు. హెచ్‌బీఎస్ కాలనీ, పోస్టాఫీసు, పెద్ద పార్కు సమీపంలో ఉన్న ఖాళీ స్థలాల్లో రైతులు నేరుగా అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తే రైతులు, వినియోగదారులకు మేలు జరుగుతుంది. అలాగే గూడూరు నగర పంచాయతీ పరిధిలో రైతు బజార్ లేక పోవడంతో రైతులు నష్టపోతున్నారు.



మార్కెట్‌లో అమ్ముతున్న రైతులు

స్థలాన్ని పరిశీలిస్తున్నాం

- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

రైతు బజార్ కోసం నేరుగా అమ్ముకునేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్నాం. వినియోగదారులు, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్థలాన్ని పరిశీలిస్తున్నాం. మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం.

రాఘవుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

మంత్రాలయం, న్యూస్‌టుడే: రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవకుమార్ ఆదివారం మంత్రాలయం చేరుకున్నారు. శ్రీమఠం చేరుకున్న వీరికి మఠం అధికారులు స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వీరి వెంట సీఐ రామాంజులు, మఠం ప్రొటోకాల్ కానిస్టేబుల్ రంగస్వామి, మఠం అధికారులు ఉన్నారు.



శ్రీమఠం ప్రాకారంలో న్యాయమూర్తి జస్టిస్ సంజీవకుమార్, పక్కన సీఐ రామాంజులు

రహదారికి మోక్షమెన్నడో?

పోలకల్ నుంచి ఎమ్మిగనూరు వరకు రహదారిపై అడుగడుగునా పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మండలంలో ఐదు ఇసుక క్వారీల నుంచి వైకాపా ప్రభుత్వంలో పరిమితికి మించి అధిక లోడుతో భారీ వాహనాల్లో ఇసుక తరలించడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పోలకల్ నుంచి ఎమ్మిగనూరు 23 కి.మీ. ఉంది. ఈ దారిలో ప్రయాణించడానికి 2 గంటల సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనదారులు ఈ దారిలో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి నూతన దారిని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసుల డ్రైవర్లు సైతం ఈ రోడ్డుపై వాహనాలు నడపడానికి అవస్థలు పడుతున్నారు. – న్యూసుటుడే, సి.బెళగల్



రోడ్డుపై నిలిచిన మురుగు



గోనెగండ్ల మండలం పెద్దనెలటూరులో ప్రధాన రహదారిపై భారీగా మురుగు నీరు నిలిచింది. దీంతో గ్రామస్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురుగంతా రోడ్డుపై నిలుస్తోంది. అపరిశుభ్ర పరిసరాలతో రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గోనెగండ్ల

నీటి కుంట కాదు.. కురువ గేరి కాలనీ

మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో కురువ గేరిలో ఇళ్ల మధ్య వర్షం నీరు నిలిచింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇక్కడ వర్షపు నీరు వెళ్లడానికి గొట్టపు ద్వారం ఉంది. దీని రంధ్రం చెత్తతో పేరుకుపోవడంతో నీరు అక్కడే నిల్వ ఉంటున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సర్పంచికి విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గత ఐదు రోజుల నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. సంబధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దకడబూరు



విద్యుత్తు స్తంభానికి మరమ్మతులు

స్పందనకు వందనం

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: కోడుమూరు కొండపేట వీధిలో చేనేత కాలనీలో విద్యుత్తు స్తంభం విరిగింది. దీనిపై ఈ నెల 17న ఈనాడులో ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన అధికారులు ఈ నెల 17న విరిగిన స్తంభం శీర్షికతో కథనం పచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ఆదివారం మరమ్మతులు చేసి విద్యుత్తు తీగలను సరిచేశారు. దీనిపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆగిన వాహనం.. నిలిచిన సేవలు

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో పశువులకు సేవలు అందించడానికి ప్రవేశ పెట్టిన సంచార పశు ఆరోగ్య సేవ వాహనం రెండు నెలలుగా నిలిచిపోయింది. వాహనం వెనుక వైపు ఉన్న టైర్ పగిలిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో కోసిగి ఎల్లమ్మ ఆలయ మైదానంలో ఓ చెట్టు కింది నిలిపివేశారు. కోసిగి, కౌతాళం మండలాల పరిధిలో పశువులకు ఆరోగ్య సేవలు అందించే వాహనం రెండు నెలలుగా నిలిచిపోయింది. పశువుల సేవలు అందించే వాహనం గ్రామాలకు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, కోసిగి



కాలనీవాసులకు అవస్థలు

మైనారిటీ కాలనీ నుంచి కర్నూలు రహదారి వైపు వెళ్లే దారి షాదీఖానా వద్ద కలిపాలి. ఈ దారిపై గుంతలు ఏర్పడటంతో కాల్వలు, మురుగు కుంటలు దర్శిమిస్తాయి. మైనారిటీ కాలనీ ప్రజలు కర్నూలుకు వెళ్లాలంటే ఎద్దుల మార్కెట్ దారి నుంచి చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలనీవాసుల నిత్యం ఆటో ఛార్జీల రూపంలో రూ.30 నుంచి రూ.60 అదనంగా ఖర్చవుతోందని వాపోతున్నారు. ఈ కాలనీలో దాదాపు 400 మంది నివాసాలు ఉంటున్నారు. పురపాలక సంఘం అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు



సాగు, తాగునీటి సమస్య పరిష్కరిస్తా

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గాజులదిన్నె జలాశయం ద్వారా శాశ్వతంగా సాగు తాగునీటి సమస్య పరిష్కారిస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దనెలటూరు, గుల్లమొరుసు గ్రామాల్లో పల్లెపండగ కార్యాక్రమానికి నిర్వహించారు. పెద్దనెలటూరులో రూ.20 లక్షలు, గుల్లమొరుసులో రూ.40 లక్షలతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అలాగే పెద్దనెలటూరు, చిన్నమర్రివీడు గ్రామాల్లో గోకులషెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి ఉచితంగా తాగునీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల అధికారంలో ఉండి రైతుల కోసం ఎలాంటి పనులు చేపట్టక పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మణిమంజరి పంచాయతీరాజ్ డీఈ చంద్రశేఖర్, డ్వామా ఏపీడీ అల్లీపీరన్, సీఐ గంగాధర్, ఏఈ శంకర్, శ్రీనివాసరెడ్డి, సర్పంచులు సోమన్న, చంద్రశేఖర్‌నాయుడు, తెదేపా నాయకులు బసవస్వామి, దానమయ్య, ఎర్రన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

అభివృద్ధికి కృషి చేద్దాం

మంత్రాలయం, న్యూస్‌టుడే: నాయకులు, కార్యకర్తలు గ్రూపు రాజకీయాలు విడి అందరం కలసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని మంత్రాలయం నియోజకవర్గ తెదేపా నాయకుడు మాధవరం రాఘవేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మంత్రాలయం రాఘవేంద్రపురంలో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులతో కలసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంతో కష్టపడి పార్టీనీ అధికారంలోకి తెచ్చుకున్న మనమందరం కలసి మెలసి పని చేయాలన్నారు. ఎవరికి ఎలాంటి కష్టం వచ్చిన మా ఇంటి తలుపు తట్టవచ్చని ప్రజలకు రాఘవేంద్ర రెడ్డి సూచించారు. వైకాపా ఐదేళ్ల పాలనలో ఇక్క భూమి పూజ చేయలేదని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఎంపీడీవో శోభారాణి, పీఆర్ ఏఈ మల్లయ్య, ఏపీవో తిమ్మారెడ్డి, తెదేపా నాయకులు వరదరాజులు, అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్, ఎస్సై పరమేశ్ నాయక్ పాల్గొన్నారు.



రాఘవేంద్రపురంలో సీసీ రోడ్లకు భూమిపూజ చేస్తున్న తెదేపా నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలం కేటాయించి, సొంత భవనాలు నిర్మించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు రాఘవేంద్ర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాఘవేంద్రపురం కాలనీలో పలు సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు ఆయన్ను కోరారు. సమస్యలు పరిష్కరించి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు.

తెదేపా హయాంలో ప్రగతి పాలన

కోసిగి, న్యూస్‌టుడే: గత ఐదేళ్లుగా అధికారంలో ఉన్న వైకాపా గ్రామాల్లో సీసీ రోడ్లు కూడా వేయలేదని మంత్రాలయం నియోజకవర్గ తెదేపా రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ఆదివారం కోసిగి 3వ వార్డు కడపాలెం ఎస్సీ కాలనీలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రామకృష్ణ రెడ్డి సీసీ రోడ్డుకు భూమి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అయ్యమ్మ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు ముత్తు రెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు రామి రెడ్డి, రామకృష్ణ, అయ్యన్న, సొట్టయ్య, జ్ఞానేష్, మాణిక్యరాజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజలో తెదేపా నాయకులు రామకృష్ణారెడ్డి, సర్పంచి అయ్యమ్మ

వివిధ పనులకు శ్రీకారం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పులకుర్తిలో రూ.69 లక్షలతో రహదారి పనులకు శ్రీకారం చుట్టినట్లు మండల ఇంజినీరు గంగారాజ్ ఆదివారం తెలిపారు. బైన్‌దొడ్డి నుంచి పులకుర్తి క్రాస్ వరకు అప్రోచ్ దారి, సీసీ రోడ్డు, పులకుర్తిలో రూ.9 లక్షలతో సీసీ రహదారికి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఉపాధి పథకం కింద పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

సి.బెళగల్, న్యూసుటుడే: గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెదేపా నాయకుడు హరి పేర్కొన్నారు. మండలంలోని కొత్తకోట, కె.శింగవరం గ్రామాల్లో సర్పంచి శ్రీనివాసులు రవీంద్రనాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పల్లె పండగ గ్రామసభల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కొత్తకోట బీసీ కాలనీలో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేసి చేశారు. కె.శింగవరం గ్రామంలో డ్వామా ద్వారా సాగు చేసిన పండ్ల తోటలను ఏపీవో రామన్న ఈసీ రంగస్వామి పరిశీలించారు. ప్లాంటేషన్ అధికారి వితేంద్రరెడ్డి, డ్వామా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న తెదేపా నేత హరి, ఏపీవో రామన్న తదితరులు

పల్లె పండగతో గ్రామాల్లో వికాసం

కౌతాళం, న్యూస్‌టుడే: పల్లె పండగతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని తెదేపా సీనియర్ నాయకులు బాపురం శివమోహనరెడ్డి, సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కౌతాళం మండలంలోని బాపురం, దొమ్మెలదిన్నె, వీరలదిన్నె గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బరాజు, ఏపీవో శంకర్, ఈసీ రఫీక్, తెదేపా నాయకులు రమేష్‌గౌడు, తదితరులు పాల్గొన్నారు.



బాపురంలో భూమిపూజ చేస్తున్న తెదేపా నాయకులు, అధికారులు

అసంపూర్తి నిర్మాణం.. అందని వైద్యం



అసంపూర్తిగా ఉన్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉంది. పడకలు చాలక వసారాలో వైద్య చికిత్స అందిస్తున్నారు. రాత్రుల్లో దోమలతో వసారాలో వైద్యం పొందుతున్న రోగులు అవస్థలు పడుతున్నారు.

రూ.12.60 కోట్లతో నిర్మాణం

ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల నుంచి వంద పడకల స్థాయికి పెంచారు. 2019లో తెదేపా హయాంలో రూ.12.60 కోట్లతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని 2020 అక్టోబరులో చేపట్టి 2022 సంవత్సరం ఆఖరికి పూర్తి చేయాల్సి ఉంది. గడువు ముగిసి రెండేళ్లయినా నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పటికే ఎనిమిది సార్లు గడువు పొగించినా ఆసుపత్రి నిర్మాణం అసంపూర్తిగా ఉంది.

వసారాలో చికిత్స

ప్రభుత్వ ఆసుపత్రికి ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల నుంచి రోజుకు 400 నుంచి 600 ఓపీ ఉంటుంది. నెలకు 200లకు పైగా ప్రసవాలు జరుగుతాయి. రోగుల రాక పెరగడంతో వార్డులు చాలక మంచాలు వసారాలో వేసి చికిత్స అందిస్తున్నారు. రాత్రుల్లో దోమల బెడదతో చికిత్స పొందుతున్న రోగులు నరకం చూస్తున్నారు.



వసారాలో చికిత్స పొందుతున్న రోగులు

మూలకు చేరిన పరికరాలు

ఆసుపత్రి స్థాయి పెరగడంతో మంచాలు, వైద్య పరికరాలు, ఇతర యంత్రాలు కేటాయించారు. పాత భవనంలో స్థలం చాలక రూ.లక్షల విలువైన కొన్ని పరికరాలను వినియోగించలేని పరిస్థితి ఏర్పడింది. పాత భవనంలో స్థలం చాలక వంద పడకల ఆసుపత్రి భవనంలో నిర్మాణం పూర్తైన రెండు గదుల్లో రక్త పరీక్ష ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం సకాలంలో పూర్తి చేస్తే రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందడంతో పాటు వార్డుల కొరత తీరి రోగులకు అవస్థలు తప్పనున్నాయి.

పూర్తి చేసేందుకు చర్యలు - హరిబ్రహ్మ, ఏఈ

వంద పడకల ఆసుపత్రి నిర్మాణం ఈ ఏడాది డిసెంబరు ఆఖరికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం పూర్తైన నిర్మాణాలకు రంగులు వేస్తున్నాం. 2025 మార్చి వరకు గడువు పెంచారు. అంత కంటే ముందే పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఎన్నికల హామీని నెరవేర్చాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాంపుల్లయ్య యాదవ్, నియోజకవర్గ నాయకుడు కాశీంవలి డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకులతో కలిసి బస్సులో ప్రయాణించి పోస్టు కార్డులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించందన్నారు. రాష్ట్రంలోనూ వెంటనే కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, వీరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మాధవరం(మంత్రాలయం), న్యూస్‌టుడే: కర్ణాటక బస్సు ఢీకొని ఆదివారం మాధవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందారు. వీరేశ్ (34) కర్ణాటక రాష్ట్రం గిల్లే సూగూరు నుంచి గ్రామానికి వస్తుండగా మాధవరం వంతెన అవతల రాయచూరు నుంచి మంత్రాలయం వస్తూన్న బస్సు ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

విష ద్రావణం తాగి ..

మాలపల్లి (మంత్రాలయం), న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాలపల్లి గ్రామానికి చెందిన వీరేశ్ (40) గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతూ ఉండేవారు. శనివారం నొప్పి తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావణం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

పల్లె కబుర్లు

సి.బెళగల్, న్యూసుటుడే: సి.బెళగల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు సోమవారం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి ప్రసాదరెడ్డి ఆదివారం తెలిపారు.

☛ గ్రామంలోని భవిత కేంద్రంలో సోమవారం ఎంఈవో జ్యోతి ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐఆర్టీ సోమశేఖరరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

☛ సి.బెళగల్ తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు శ్రీనివాసులు అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఉపతహసీల్దారు పురుషోత్తం ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

☛ పోలకల్‌లోని సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయం ధర్మకర్త పద్మనాభరెడ్డి ఆదివారం తెలిపారు.

కర్నూలు
•కర్నూలు •పాణ్యం

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి


నివాళి అర్పిస్తున్న డీటీఎఫ్ సభ్యులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నగరంలోని డీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రొఫెసర్ సాయిబాబాకు ఆదివారం నివాళి అర్పించారు. డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ... ఆదివాసుల హక్కులు, దిల్లీ వర్సిటీలో విద్యార్థుల హక్కుల కోసం సాయిబాబా పోరాటం చేశారన్నారు. దివ్యాంగుడైనప్పటికీ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు, లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, నాగేశ్వర్ ఆచారి పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పులు వస్తున్నాయని, వృద్ధులు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్యుడు డా.శంకర్ శర్మ అన్నారు. నగరంలోని పట్టణ నిరాశ్రయ వసతి గృహంలో వృద్ధులకు ఆయన ఆదివారం దుప్పట్లు, దోమ తెరలను పంపిణీ చేశారు. వృద్ధులు నిర్లక్ష్యం చేస్తే దోమకాటుకు గురైన విష జ్వరాలకు గురికావాల్సి వస్తుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
డివిజన్లు : 63004 66875

కర్నూలు నగర పాలక సంస్థ: **సమస్య:** కృష్ణానగర్ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు

సమస్య: వీకర్ సెక్షన్ కాలనీలోని వీధుల్లో మురుగు కాల్వలు శుభ్రం చేయించగలరు. – పరశురాం

సమాధానం: సమస్యల్ని పరిశీలించి పరిష్కరిస్తాం. – నగర పాలక అధికారులు

గ్రామాల అభివృద్ధికి కృషి

పర్ల (కల్లూరు గ్రామీణం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. కల్లూరు మండలంలోని పర్ల గ్రామంలో ఆదివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామీణాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసర్‌రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో నాగశేషాచల్‌రెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కాల్వల్లో పైపులు.. కలుషిత జలాలు

☛ తరచూ లీకేజీలతో నగరవాసుల అవస్థలు

కర్నూలు సచివాలయం, కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే: కర్నూలు, కల్లూరు కాలనీల్లో తాగునీటి తిప్పలు తప్పడం లేదు. రెండు రోజులకోసారి.. అదీ అరగంటపాటే నీటిని సరఫరా చేస్తున్నారు. నూటికి 60-70 శాతం ఇళ్లకు మోటార్లను బిగించుకున్నారు. మోటార్లు లేని ఇళ్లకు తాగునీటి సరఫరా కావడం లేదు. ఏ సమయంలో నీటిని సరఫరా చేసేది తెలియని పరిస్థితి. తాగునీటి కోసం నగరవాసులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక సరఫరా చేసే నీళ్లయినా శుభ్రంగా ఉంటాయంటే అదీ లేదు. మురుగు వస్తున్నాయని నగరవాసులు వాపోతున్నారు. నగర పాలక సంస్థ మంచి నీటి ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే శుద్ధి చేయకుండా వదలుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు నీరు బురదగా, మట్టితో వస్తోంది.


కల్లూరులోని చింతలముని నగర్‌లో తాగునీటి పైపులు మురుగు కాలువలో ఉన్నాయి. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొనడంతో పైపులు లీకై తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. పైపులైన్లను కాల్వల్లో కాకుండా పక్క నుంచి వెళ్లేలా నగర పాలక అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మురుగు కాలువలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ తరచూ నీరు కలుషితమవుతోందని సమీపంలో నివసిస్తున్న వారు ఆరోపిస్తున్నారు.

కర్నూలులోని బుధవారపేట కాలనీలో తాగునీరు సరఫరా అధ్వానంగా ఉంటోంది. మూడు వార్డులుండే ఈ కాలనీలో 40 వేల మందికిపైగా నివసిస్తున్నారు. ఎ.క్యాంపులోని ట్యాంకు నుంచి వీరికి రోజూ ఒక గంట నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే అధిక శాతం మంది కుళాయిలకు విద్యుత్తు మోటార్లు బిగించుకోవడంతో మోటార్లు లేని నిరుపేదలకు నీరందడం లేదు. వారి ట్యాంకులు నిండి మోటార్లు ఆప్ చేస్తే తప్ప వీరికి కుళాయిలకు నీరు రాని పరిస్థితి నెలకొంది. వారి ట్యాంకులు నిండేసరికి దాదాపు 40 నుంచి 50 నిమిషాల సమయం పట్టనుంది. తర్వాత పది నిమిషాలకే గంట సమయం ముగుస్తుండటంతో ఇంటి అవసరాలకు సరిపడా నీరందడం లేదని నాగమయ్యకట్ట వీధివాసులు వాపోతున్నారు. నీరు వదిలే సమయాన్ని పెంచాలని వారు కోరుతున్నారు. ఇటీవల కాలంలో కుళాయిలకు నీరు శుభ్రంగా రావడం లేదని, కలుషిత నీరు తాగి అనారోగ్యానికి గురవుతున్నట్లు చెబుతున్నారు. చెత్త సేకరణ సరిగా లేకపోవడం, కాల్వలో తీసిన పూడిక తరలించకపోవడంతో మళ్లీ కాల్వలోనే వెళ్తోంది. చెత్త పేరుకుపోయి కాల్వల్లో మురుగు కదలడం లేదు. దీంతో వాటిపై నున్న తాగునీటి ఇనుప పైపులు దెబ్బతింటున్నాయి. లీకేజీలతో నీరు ఇంకి కలుషితమవుతోంది. కూలీ పనులకు ఉదయం వెళ్లి రాత్రికి తిరిగి వచ్చే కాలనీవాసులకు తాగునీటి సరఫరా సమస్యగా మారింది.



ఘనంగా సత్యసాయి అవతార ప్రకటన వేడుకలు

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయిబాబా అవతార ప్రకటన వేడుకలు కర్నూలులోని సత్యసాయి మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేద పఠనం, ప్రత్యేక భజన, మహామంగళహారతి అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. సత్యసాయి సేవా దళ్ సభ్యులు, భక్తులు హాజరయ్యారు. అంతకు ముందు విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ పార్వతి మాట్లాడుతూ... పుట్టపర్తి కేంద్రంగా సత్యసాయిబాబా ప్రారంభించిన సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సాయి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు జి.సాయిబాబా, సీనియర్ సేవాదళ్ పట్టాభిరామయ్య, రేవన్న, మహిళా సేవాదళ్ సంధ్య, లక్ష్మీసరోజ, శారద పాల్గొన్నారు.


సాయిబాబా చిత్రపటం వద్ద పుష్పాలు సమర్పిస్తున్న మహిళలు

క్రైం కార్నర్

ఫేక్ ఫోన్‌పే చేసి దొరికిపోయిన యువకుడు


కార్తీక్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులో ఏటీఎంల వద్ద ఫేక్ ఫోన్‌పేలతో మోసాలకు పాల్పడుతున్న ఓ యువకుడు దొరికిపోయాడు. బి.తాండ్రపాడుకు చెందిన కార్తీక్ ఉయ్యాలవాడ పోస్టాఫీసులో మెసెంజర్‌గా పని చేస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌లతో అప్పుల పాలైన ఇతడు మోసాలకు పాల్పడుతున్నాడు. కర్నూలు ఎస్బీఐ ప్రధాన కార్యాలయం ఏటీఎంల వద్ద ఉండి డిపాజిట్ చేసేందుకు వచ్చే వారిని మోసాలకు పాల్పడుతున్నాడు. డబ్బు తనకు ఇస్తే ఫోన్‌పే ద్వారా ఖాతాకు పంపుతానని నమ్మించి రమేశ్ అనే వ్యక్తి వద్ద రూ.10 వేలు తీసుకున్నాడు. జిమ్మిక్కు చేసి ఫోన్‌పే చేసినట్లు అతని చరవాణికి తప్పుడు సమాచారం పంపించాడు. అప్రమత్తమైన అతడు డబ్బులు ఖాతాలో జమ కాలేదని గుర్తించి ఫేక్ ఫోన్‌పే గ్రహించి అతన్ని పట్టుకుని తన డబ్బులు తిరిగి వసూలు చేసుకున్నారు. పోలీసులకు అప్పగించగా వారు విచారించగా ఈ విధంగా పలువురిని మోసగించి రూ.1.50 లక్షలు కాజేసినట్లు ఒప్పుకొన్నట్లు తెలిసింది.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: 18 ఏళ్ల క్రితం తప్పుడు వివరాలతో అక్రమ రిజిస్ట్రేషన్ చేసి మోసగించిన ఆరోపణలపై కర్నూలుకు చెందిన బాగిరెడ్డి మనోహర్‌రెడ్డి, జి.కిరణ్ కుమార్, మదన్‌మోహన్‌లపై కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కర్నూలు మండలం పంచలింగాల పరిధిలోని 2.85 ఎకరాలకు సంబంధించి దస్తావేజుల్లో తప్పుడు వివరాలు పొందుపరిచి 2006లో కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ (దస్తావేజుల నంబరు 15841/2006) చేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఉదంతం వివాదం కావడంతో ప్రస్తుతం కర్నూలు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ శశికుమార్ ఆదివారం ముగ్గురిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసుల అదుపులో మోసగాడు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగాల పేరుతో మోసగించిన ఓ వ్యక్తిని కర్నూలు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కర్నూలుకు చెందిన 19 మంది నిరుద్యోగుల నుంచి రూ.95 లక్షలు తీసుకుని మోసగించిన నేపథ్యంలో నలుగురిపై కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నలుగురు నిందితుల్లో ఒకరిని హైదరాబాద్‌లో పట్టుకుని తీసుకువచ్చి విచారిస్తున్నారు. ఆదివారం 8 మంది బాధితుల నుంచి పోలీసులు వాంగూల్మం తీసుకున్నారు. మరికొందరి వాంగ్మూలం సోమవారం తీసుకోనున్నారు.

ఒరిగిన స్తంభం.. ప్రయాణికుల్లో భయం



జొహరాపురం నుంచి వెంకాయపల్లెకు వెళ్లే ప్రధాన రహదారిలో ఐహెచ్ఎస్‌డీపీ కాలనీ సమీపంలో ఓ విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఓవైపు ఒరిగిపోయింది. ఏ క్షణంలో నేల వాలుతుందోనని అటుగా వెళ్లే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని నెలలుగా ఇలానే ఉంటోందని, చాలాసార్లు విద్యుత్తు, నగర పాలక శాఖ అధికారులకు విన్నవించినా సరిచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ప్రమాదకరంగా మార్గబిలం

కల్లూరు పట్టణంలోని వీకర్ సెక్షన్ కాలనీ మెయిన్ రోడ్డు సమీపంలోని ఓ వీధిలో మార్గబిలం ప్రమాదకరంగా మారింది. రాకపోకలు సాగే క్రమంలో వాహనాలు గుంతలో ఇరుక్కుపోతున్నాయి. దీంతోపాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనచోదకులు, నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణం



సీఎం దృష్టికి కళాకారుల సమస్యలు తీసుకెళ్లాం

కర్నూలు నగరం (సాంస్కృతికం), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కళాకారుల సమస్యలపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, ఈ మేరకు ఆయన స్పందించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని రాష్ట్ర కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు, ప్రముఖ రంగస్థల కళాకారిణి మంగాదేవి అన్నారు. టీజీవీ కళాక్షేత్రం ఆదివారం రాత్రి సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ప్రదర్శనలతోపాటు కళాకారుల సమస్యలు తెలుసుకుంటున్నామని, ఇటీవల ఒంగోలులో నిర్వహించిన ప్రదర్శనకు వచ్చిన రూ.2 లక్షలను వరద బాధితుల సహాయార్థం అందించినట్లు ఆమె పేర్కొన్నారు. రాయలసీమలో కర్నూలు జిల్లా రంగస్థల నాటక ప్రదర్శనలో ముందజలో ఉందని, కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులను ఆదరించి ఆశ్రయం కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం సత్యహరిశ్చంద్ర నాటకంలోని కళాకారులను సత్కరించి పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, మహ్మద్‌మియ్యా, లక్ష్మీకాంతారావు, శ్రీనివాసరెడ్డి, యాగంటీశ్వరప్ప, రాముడు పాల్గొన్నారు.


కళాకారులను సత్కరిస్తున్న పత్తి ఓబులయ్య, మహ్మద్‌మియ్యా

కేఎంసీ పార్కులో...

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ఆత్మరక్షణ కోసం ప్రతి విద్యార్థి తైక్వాండో నేర్చుకోవాలని కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి అన్నారు. కొండారెడ్డి బురుజు సమీపంలోని కేఎంసీ పార్కులో తైక్వాండో బెల్ట్ పరీక్షలను ఆయన ప్రారంభించారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు వెంకటేశ్వర్లు, లలిత, మల్లేష్, విశ్వాసరావు, శివమణి, తేజల, తిలక్, అకిల్, సాయికృష్ణ, రవికుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రచయిత సయ్యద్ జాకీర్ పేర్కొన్నారు. పాతబస్తీలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ పాఠశాలలో ఆదివారం ఉర్దూ కవుల సమ్మేళనాన్ని బజ్మె ఎ ఉర్దూ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేశంలోని భాషల్లో ఉర్దూకు ప్రత్యేకత ఉందన్నారు. సమాజంలో నెలకొంటున్న పరిస్థితులను ఉర్దూ చదివేవారికి అందించేందుకు ప్రతి ఉర్దూ రచయిత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అజ్మత్, సమి, సయ్యద్ ఖుద్రతుల్లా ఖాద్రీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉర్దూ రచయిత సయ్యద్ జాకీర్

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: చిన్నారులు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని ఠాగూర్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. షరీన్ నగర్‌లోని ఠాగూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను ఆయన ప్రారంభించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు, పతకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని మంజుల, శిక్షకులు రాంబాబు, సోమశేఖర్ పాల్గొన్నారు.


పత్రాలతో చిన్నారులతో ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి

కర్నూలు ఎంపీకి సన్మానం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: బీసీ భవన నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపిన కర్నూలు ఎంపీ నాగరాజును బీసీ సంఘం నాయకులు ఆదివారం ప్రత్యేకంగా కలిసి సన్మానించారు. బీసీ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.50 కోట్ల నిధులు ఇవ్వడంలో కీలక పాత్ర పోషించారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాంబాబు, తెదేపా లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు చీమల చంద్రశేఖర్ తెలిపారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే పోటీతత్వం అలవర్చుకోవాలని ఖిస్వ అధ్యక్షుడు ఎం.ఎస్. రహమాన్ అన్నారు. పాతబస్తీలోని ఉస్మానియా కళాశాలలో ఆదివారం మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు జ్ఞాపకశక్తిని పెంచుతాయన్నారు.

ఫార్మాసిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఫార్మాసిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని డీఎంహెచ్‌వో భాస్కర్ అన్నారు. ఆదివారం వైద్య కళాశాలలోని ఓల్డ్ సీఎల్జీలో ఫార్మాసిస్టుల అసోసియేషన్ సమావేశాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు రంగస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్టుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజేష్‌నాయక్, ఫార్మాసిస్టులు వీరాంజనేయులు, సత్యప్రసాద్, బీవీఆర్ శ్రీనివాసులు, శర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి, డీఎంహెచ్‌వో

రాజకీయాల కోసం కులాల మధ్య చిచ్చు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: హిందూ సమాజంలో వృత్తులను బట్టి మాత్రమే కులాలు ఏర్పడ్డాయని, రామాయణ, భారత, భాగవతాది దివ్య గ్రంథాల్లో ఇది నిరూపితమైందని వీహెచ్‌పీ కేంద్రీయ సామాజిక సమరసత ప్రముఖ్ దేవ్‌జీ భాయ్ రావత్ అన్నారు. నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో కుల సంఘాల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు రాజకీయ నాయకుల స్వార్థం కోసం కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ... కులాలు పక్కన పెట్టి దేశం కోసం హిందువులంతా ఏకం కావాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి మాట్లాడుతూ.. గడప లోపలే కులం, గడప దాటితే హిందువులం అన్న నినాదాన్ని సమాజానికి అందించాలన్నారు. మాళిగి వ్యాసరాజు, మహేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవ్‌జీభాయ్ రావత్

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించండి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సు సౌకర్యాన్ని వెంటనే అమలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండు చేశారు. ఆదివారం కొత్త బస్టాండు నుంచి ఆర్టీసీ బస్సులో పోస్టుకార్డులు ప్రదర్శిస్తూ ప్రయాణించారు. నాయకులు షేక్ ఖాజాహుస్సేన్, ప్రమీల, వెంకట సుజాత, సాయికృష్ణ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థరైటిస్‌పై అవగాహన అవసరం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: సమాజంలో ఆర్థరైటిస్‌పై అవగాహన లోపంతో దీర్ఘకాలికంగా కీళ్లనొప్పులతో బాధపడుతున్నారని, ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం తీసుకుంటే దీనిని నివారించవచ్చని రుమటాలజిస్టు డాక్టర్ శ్రీహరిరెడ్డి, రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ గోవిందు అన్నారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు ప్రపంచ ఆర్థరైటిస్ దినాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. జనాభాలో 5 శాతం మంది ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారని పేర్కొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీహరిరెడ్డి, డాక్టర్ గోవిందురెడ్డి

ఆక్రమణ తొలగింపునకు చర్యలు తీసుకోండి

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: హైకోర్టు ఉత్తర్వుల మేరకు కల్లూరు పట్టణంలోని సర్వే నంబరు 645/ఎలోని వక్ఫ్ బోర్డు భూమిలో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు నగర పాలక కమిషనర్ రవీంద్రబాబుకు లేఖ రాశారు.

ఆరేపల్లి రచనలు.. ఆణిముత్యాలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: ఆసక్తి ఉంటే.. ఆ శక్తి అదే వస్తుందంటారు పెద్దలు. వయస్సు, ఉన్నత చదువుతో నిమిత్తం లేకుండా చక్కని పదాలతో రచనలు చేయొచ్చని 89 ఏళ్ల వృద్ధురాలు నిరూపిస్తున్నారు. తెలుగు భాషపై అభిమానంతో తాను కూడా సమాజంలో రచయితగా గుర్తింపు పొందాలని అక్షర యజ్ఞం చేస్తున్నారు. కోడుమూరు మండలం ప్యాలకుర్తి చెందిన వరలక్ష్మమ్మ 1935 ఏప్రిల్ 25న జన్మించారు. 8వ తరగతి వరకు చదువుకున్నారు. ఆ కాలంలో 14 ఏళ్లకే అనంతరెడ్డితో వివాహమైంది. 1975లో కర్నూలులో స్థిరపడ్డారు. చిన్నప్పటి నుంచి రామాయణం, భాగవతం అంటే ఇష్టముండటంతో గ్రామాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరయ్యేవారు. కర్నూలుకు వచ్చిన తర్వాత చురుకుగా, ఆసక్తిగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి బియ్యం సేకరించి నెల తర్వాత ఆ బియ్యాన్ని వండి పేదలకు అన్నదానం చేసేవారు ఆమె. వరలక్ష్మమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారంతా ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

రచనలు ఇలా..



హనుమలీలామృతం, శ్రీకృష్ణ సుధార్ణవం, కుమార విజయం, శ్రీకృష్ణ గానామృతం, నీలిపథం, పరమ భాగవతులు, సౌందర్యలహరి, భక్త విజయం, కోవిడమ్మ శతకం, భారతీయ మహిళా రచయిత్రులు, పుష్కరుని చరిత్ర, భీష్మస్తుతి, బాలలతో బామ్మ (రామాయణం), శ్రీమదాంధ్ర మహాభారతం (ఆది, సభా పర్వాలు), మహాభాగవతం, దేవీభాగవతం తదితర రచనలు చేశారు. సాహితీ రంగానికి ఈమె చేసిన సేవలను గుర్తించి పలు సంఘాలు, సాహితీ సంస్థలు, తెలుగు భాషా వికాస సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. గతేడాది కర్నూలులో నిర్వహించిన మహిళా రచయితల రాష్ట్ర స్థాయి సమావేశంలో మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపిక అందించారు.

☛ 89 ఏళ్ల వయస్సులో పుస్తక రచన

తెలుగు భాష అంటే ఇష్టంతోపాటు తెలుగు ఉపన్యాసాలు వినడంపై ఆసక్తి ఉన్న ఆరేపల్లి వరలక్ష్మమ్మ 2017లో వ్యక్తిగత పనులపై హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చింది. తన బంధువులతో కలిసి రవీంద్రభారతిలో నిర్వహించిన ఒక తెలుగు సాహిత్య కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడి నుంచి ఆమెకు రచనపై మరింత ఆసక్తి పెరిగింది. దాంతో తొలిసారిగా 'ఆణిముత్యాలు', శ్రీరామచంద్ర శతకం, శ్రీకృష్ణ శతకం'తో రచనలు ప్రారంభించారు. అప్పటి నుంచి 35 పుస్తకాలు రచించి ముద్రించి మార్కెట్‌లోకి తీసుకువచ్చారు.


కర్నూలు తెలుగు తోటలో సన్మానం అందుకుంటున్న వరలక్ష్మమ్మ